

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 05-07-2025 | సంపుటి - 24 | సంచిక - 62 | రూ : 4 | పేజీలు: 8




2లో

## నౌకాదళ చరిత్రలో నారీశక్తి..

## తొలి మహిళా ఫైటర్ పైలట్‌గా ఆస్థా పూనియా

- భారత నౌకాదళంలో ఫైటర్ పైలట్‌గా శిక్షణ పొందిన తొలి మహిళగా ఆస్థా పూనియా
- ఐఎన్ఎస్ డేగాలో విజయవంతంగా శిక్షణ పూర్తి
- ప్రతిష్ఠాత్మక 'వింగ్స్ ఆఫ్ గోల్డ్' పురస్కారం స్వీకరణ
- లింగ సమానత్వం దిశగా భారత నేవీ కీలక ముందడుగు
- 'నారీశక్తి'ని ప్రోత్సహించడంలో మరో మైలురాయి

## పుణేలో 'ఆపరేషన్ సిందూర్'ను గుర్తుచేసిన కేంద్ర హోంమంత్రి

2లో

- పూణెలో నేషనల్ డిఫెన్స్ అకాడమీలో మాట్లాడిన అమిత్ షా
- 'ఆపరేషన్ సిందూర్'తో దేశ సత్తా చాటామన్న హోంమంత్రి
- పహల్గామ్ దాడికి ప్రతీకారంగా పాక్ ఉగ్రశిబిరాల ధ్వంసం

## ఆ లెక్కల్లో ఒక్కటి తగ్గినా

# కాళ్లు మొక్కి తప్పుకుంటాను

### రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు

- కేసీఆర్, మోదీలు చర్చకు రావాలని సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సవాల్
- తొలి ఏడాదిలోనే 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని స్పష్టం
- వచ్చే ఎన్నికల్లో 100 అసెంబ్లీ సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం
- ఒక్క సీటు తగ్గినా పూర్తి బాధ్యత తనదేనని వెల్లడి
- మూడు రంగుల జెండాతో కల్వకుంట్ల గడీల పాలనకు చరమగీతం పాడామన్న ముఖ్యమంత్రి
- కాంగ్రెస్ నేతలంతా ఐక్యంగా ఉన్నారని, పాలన నిలకడగా సాగుతోందని వ్యాఖ్య

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని, ఈ గణాంకాలపై చర్చకు ఎవరైనా రావొచ్చని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. కేసీఆర్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎవరైనా చర్చకు సిద్ధమని ఆయన స్పష్టం చేశారు. ఉద్యోగాల సంఖ్యలో ఒక్కటి తగ్గినా తాను కాళ్ళు మొక్కి పదవి నుండి తప్పుకుంటానని అన్నారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన 'సామాజిక

తరువాయి 2లో






## పుతిన్‌తో ట్రంప్ చర్చలు..

# గంటల వ్యవధిలోనే కీవ్‌పై రష్యా భీకర దాడి

- పుతిన్‌తో ట్రంప్ చర్చలు జరిపిన మరుసటి రోజే ఉక్రెయిన్‌పై రష్యా దాడి
- 539 డ్రోన్లు, 11 క్షిపణులతో విరుచుకుపడిన మాస్కో సేనలు
- కీవ్‌లోని పోలండ్ దౌత్య కార్యాలయానికి స్వల్ప నష్టం
- 8 ప్రాంతాల్లో విధ్వంసం, 40 అపార్ట్‌మెంట్లు ధ్వంసం

2లో

## భూ సమస్యలపై చంద్రబాబు ఆగ్రహం..

# రెవెన్యూ శాఖ పనితీరుపై అసంతృప్తి

### రెవెన్యూ శాఖ పనితీరుపై సీఎం చంద్రబాబు సమీక్ష

- రెవెన్యూ శాఖ పనితీరుపై సీఎం చంద్రబాబు సమీక్ష
- అధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం
- గత ప్రభుత్వం వల్లే భూ వివాదాలు పెరిగాయని విమర్శ
- తహసీల్దార్ కార్యాలయాల్లో అర్జీల పెండింగ్‌పై సీరియస్
- శాఖలో భారీ మార్పులు, టెక్నాలజీ వాడకంపై దృష్టి

రెవెన్యూ శాఖ పనితీరుపై సీఎం చంద్రబాబు తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేశారు. భూ సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతుండటంపై అధికారుల తీరును ఆయన తప్పుబట్టారు. శుక్రవారం సచివాలయంలో రెవెన్యూ శాఖపై నిర్వహించిన కీలక సమీక్ష సమావేశంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. శాఖ పనితీరు పట్ల సీఎం ఏమాత్రం సంతృప్తిగా లేరని సమాచారం.

తరువాయి 2లో





## పది తర్వాత చదువు ఆపొద్దు...

# ప్రతి విద్యార్థి కాలేజీలో చేరాలి

### చదువు మానేసి ఎవరూ ఇంట్లో ఉండకూడదని మంత్రి లోకేశ్ ఆదేశం

- ప్రతి విద్యార్థి ఎక్కడ చేరారో ట్రాక్ చేయాలని అధికారులకు సూచన
- ఆగస్టు 7 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'అక్షర ఆంధ్ర' కార్యక్రమం ప్రారంభం
- యూడైస్ నమోదు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని స్పష్టం
- ప్రత్యేక అవసరాల విద్యార్థులకు మార్కుల విధానంలో కీలక మార్పులు

2లో

## పది తర్వాత చదువు ఆపొద్దు...
# ప్రతి విద్యార్థి కాలేజీలో చేరాలి

పదో తరగతి పూర్తి చేసిన తర్వాత ఏ ఒక్క విద్యార్థి కూడా చదువు మానేయకుండా, ప్రతి ఒక్కరూ ఇంటర్మీడియట్ లేదా వృత్తి విద్యా కోర్సుల్లో తప్పనిసరిగా చేరేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లిలోని తన నివాసంలో ఇంటర్మీడియట్ విద్యపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ, "పదో తరగతి పాసైన ప్రతి విద్యార్థి ఎక్కడ, ఏ కోర్సులో ప్రవేశం పొందారో కచ్చితంగా ట్రాక్ చేయాలి. ఇందుకోసం పాఠశాల విద్యాశాఖతో సమన్వయం చేసుకుని పక్కాగా వివరాలు నమోదు చేయాలి" అని స్పష్టం చేశారు. ఈ ఏడాది ఇంటర్ మొదటి సంవత్సరంలో 5,00,965 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారని అధికారులు మంత్రికి వివరించారు. యూడైస్ నమోదు ప్రక్రియను మరింత సమర్థవంతంగా చేపట్టాలని మంత్రి సూచించారు. రాష్ట్రంలో నిరక్షరాస్యతను నిర్మూలించేలక్ష్యంతో ఆగస్టు 7వతేదీనుంచి 'అక్షర ఆంధ్ర' (ప్రాజెక్ట్ అఆ) కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు అధికారులు ఈ సమావేశంలో తెలిపారు. అదేవిధంగా, ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు ఐఐటీ, ఎన్ఐటీ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో ప్రవేశాలు పొందేందుకు ఇబ్బందులు లేకుండా, వారికి భాషా సబ్జెక్టుల మార్కులను మిగిలిన సబ్జెక్టుల మార్కుల సగటుగా పరిగణించాలని మంత్రి లోకేశ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సమీక్షలో పాఠశాల విద్య కార్యదర్శి కోన శశిధర్, సమగ్రశిక్ష ఎస్పీడీ బి. శ్రీనివాసరావు, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కృతికా శుక్లా తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## భూ సమస్యలపై చంద్రబాబు ఆగ్రహం..
# రెవెన్యూ శాఖ పనితీరుపై అసంతృప్తి

(మొదటిపేజీ తరువాయి)

గత పాలకుల వైఫల్యాల కారణంగానే రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో భూ వివాదాలు, సర్వే సమస్యలు తీవ్రమయ్యాయని చంద్రబాబు ధ్వజమెత్తారు. తహసీల్దార్ కార్యాలయాల్లో వేల సంఖ్యలో అర్జీలు పరిష్కారానికి నోచుకోకుండా పేరుకుపోవడంపై ఆయన మండిపడ్డారు. ప్రభుత్వంపై ప్రజల్లో సానుకూలత రావాలంటే భూ సమస్యలను వేగంగా పరిష్కరించడం, సేవలను సులభతరం చేయడం అత్యంత కీలకమని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.మహానాడులో ఇచ్చిన హామీ ప్రకారం ఏడాదిలోగా భూ సమస్యలను పరిష్కరించి తీరుతామని ఈ సందర్భంగా చంద్రబాబు పునరుద్ఘాటించారు. కేవలం పైపైన మార్పులు కాకుండా, క్షేత్రస్థాయి నుంచి రెవెన్యూ శాఖలో సమూల ప్రక్షాళన చేస్తే తప్ప ఫలితాలు రావని ఆయన భావిస్తున్నారు. సిబ్బంది కొరత, పనిభారం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటూనే, రెవెన్యూ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు సాంకేతికతను విస్తృతంగా వినియోగించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ సమీక్ష అనంతరం భూ సమస్యల పరిష్కారంపై సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు జారీ చేసే అవకాశం ఉంది.

## పుతిన్‌తో ట్రంప్ చర్చలు..
# గంటల వ్యవధిలోనే కీవ్‌పై రష్యా భీకర దాడి

ఉక్రెయిన్‌పై రష్యా మరోసారి విరుచుకుపడింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్ మధ్య యుద్ధ నివారణపై సుదీర్ఘ చర్చలు జరిగిన గంటల వ్యవధిలోనే మాస్కో సేనలు దాడులకు దిగడం కలకలం రేపింది. శుక్రవారం నాడు ఉక్రెయిన్ రాజధాని కీవ్‌తో పాటు పలు నగరాలపై రష్యా డ్రోన్లు, క్షిపణులతో భీకర దాడికి పాల్పడింది. ఈ దాడుల్లో భాగంగా మొత్తం 539 డ్రోన్లు, 11 క్షిపణులను ప్రయోగించినట్లు ఉక్రెయిన్ వాయుసేన వెల్లడించింది. కీవ్‌లో జరిగిన దాడిలో పోలండ్ దౌత్య కార్యాలయ భవనం దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు. అయితే, ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని స్పష్టం చేశారు. దాడుల సమయంలో బాంబుల నుంచి రక్షించుకోవడానికి స్థానిక ప్రజలు సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. రష్యా దాడుల కారణంగా ఉక్రెయిన్‌లోని మొత్తం 8 ప్రాంతాల్లో తీవ్ర విధ్వంసం జరిగినట్లు కీవ్ ప్రభుత్వం పేర్కొంది. ఈ దాడుల్లో సుమారు 40 అపార్ట్‌మెంట్లు, పలు పాఠశాలలు ధ్వంసమయ్యాయని తెలిపింది. అదేవిధంగా రైల్వే మౌలిక సదుపాయాలు కూడా దెబ్బతిన్నాయని వెల్లడించింది. రైల్వే ట్రాక్‌లు, సిగ్నలింగ్ వ్యవస్థకు నష్టం వాటిల్లడంతో పలు రైళ్లను వేరే మార్గాల్లో మళ్లించినట్లు ఉక్రెయిన్ రైల్వే శాఖ ఒక ప్రకటనలో వివరించింది.

## నౌకాదళ చరిత్రలో నారీశక్తి..
## తొలి మహిళా ఫైటర్ పైలట్‌గా ఆస్థా పూనియా

భారత నౌకాదళ చరిత్రలో ఓ సరికొత్త అధ్యాయం లిఖితమైంది. సబ్ లెఫ్టినెంట్ ఆస్థా పూనియా, నేవీ ఫైటర్ పైలట్ గా శిక్షణ పొందిన మొట్టమొదటి మహిళా అధికారిగా చరిత్ర సృష్టించారు. లింగ సమానత్వం దిశగా నౌకాదళం వేసిన ఈ కీలక అడుగు, భవిష్యత్తులో మరింత మంది మహిళలు సాయుధ దళాల్లో ఉన్నత బాధ్యతలు చేపట్టేందుకు స్ఫూర్తినివ్వనుంది. ఐఎన్ఎస్ డేగాలో జులై 3న జరిగిన సెకండ్ బేసిక్ హాక్ కన్వర్షన్ కోర్సు స్నాతకోత్సవంలో ఆస్థా పూనియా ఈ అరుదైన ఘనతను సాధించారు. ఈ కార్యక్రమంలో ఆమె, లెఫ్టినెంట్ అతుల్ కుమార్ ధుల్‌తో కలిసి ఏసీఎన్ఎస్ (ఎయిర్), రియర్ అడ్మిరల్ జనక్ బేవలీ చేతుల మీదుగా ప్రతిష్ఠాత్మక 'వింగ్స్ ఆఫ్ గోల్డ్' పురస్కారాన్ని అందుకున్నారు. ఈ విషయాన్ని భారత నౌకాదళం ఎక్స్ వేదికగా వెల్లడించింది. ఇప్పటికే మహిళా అధికారులు పైలట్లుగా, నేవల్ ఎయిర్ ఆపరేషన్స్ ఆఫీసర్లుగా హెలికాప్టర్లు, నిఘా విమానాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే, అత్యంత కీలకమైన ఫైటర్ స్ట్రీమ్‌లోకి ఓ మహిళా పైలట్‌ను తీసుకోవడం ఇదే ప్రథమం. 'నారీశక్తి'ని ప్రోత్సహిస్తూ, నౌకాదళ వైమానిక విభాగంలో (నేవల్ ఏవియేషన్) మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలనే నిబద్ధతకు ఈ చారిత్రక ఘట్టం నిదర్శనమని నేవీ పేర్కొంది. ఆస్థా పూనియా విజయం అడ్డంకులను అధిగమించి, ఓ నూతన శకానికి నాంది పలికిందని ప్రశంసించింది.

## ఆ లెక్కల్లో ఒక్కటి తగ్గినా
# కాళ్లు మొక్కి తప్పుకుంటాను

న్యాయ సమరభేరి' సభలో ఆయన మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల్లో పార్టీ 100 అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధించి తిరిగి అధికారంలోకి వస్తుందని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఒకవేళ ఒక్క స్థానం తగ్గినా దానికి తానే పూర్తి బాధ్యత వహిస్తానని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొద్దికాలమే ఉంటుందని విమర్శించిన వారి అంచనాలను తలకిందులు చేస్తూ, పార్టీ నాయకులంతా ఐక్యంగా ప్రజాపాలన అందిస్తున్నారని తెలిపారు. కార్యకర్తలకు అన్ని పదవులు దక్కేవరకు తాను విశ్రమించబోనని హామీ ఇచ్చారు. తమ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, 18 నెలల్లోనే రూ.1.04 లక్షల కోట్లు ఖర్చు చేసిందని రేవంత్ రెడ్డి వివరించారు. గత ప్రభుత్వం వరి వేస్తే ఉరి అన్నదని, కానీ తాము 2.80 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించి దేశానికే ఆదర్శంగా నిలిచామని గుర్తు చేశారు. రైతు భరోసా విషయంలో ప్రభుత్వం విఫలమవుతుందని కొందరు ఆశించారని, కానీ వారి ఆశలు నెరవేరలేదని అన్నారు. తాము ఇచ్చిన హామీ మేరకు ఏడాదిలోనే కులగణన, ఎస్సీ వర్గీకరణ ప్రక్రియలను పూర్తి చేశామని చెప్పారు. మూడు రంగుల జెండాతో కల్వకుంట్ల గడీల పాలనను కూల్చివేసి, ప్రతి హృదయాన్ని స్పృశిస్తూ పాలన సాగిస్తున్నామని పేర్కొన్నారు.

## పుణేలో 'ఆపరేషన్ సిందూర్'ను గుర్తుచేసిన కేంద్ర హోంమంత్రి

* **దేశ రక్షణలో ప్రభుత్వ నిబద్ధతకు ఇదే నిదర్శనమని వ్యాఖ్య**
* **పీష్వా బాజీరావ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన అమిత్ షా**
* **శివాజీ, పీష్వాల వల్లే భారత నిర్మాణం నిలిచిందని ప్రశంస**

దేశ సార్వభౌమాధికారాన్ని, సమగ్రతను కాపాడటంలో కేంద్ర ప్రభుత్వం, భారత సాయుధ దళాలు ఎంత నిబద్ధతతో ఉన్నాయో చెప్పడానికి 'ఆపరేషన్ సిందూర్' ఒక గొప్ప ఉదాహరణ అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్‌లోని తొమ్మిది ఉగ్రవాద శిబిరాలను మన సైన్యం ధ్వంసం చేసిందని ఆయన గుర్తు చేశారు. పూణెలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ)లో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఎన్‌డీఏ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పీష్వా బాజీరావ్ విగ్రహాన్ని అమిత్ షా ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ, సైనిక నాయకత్వాన్ని తీర్చిదిద్దే ఎన్‌డీఏ ప్రాంగణంలో పీష్వా బాజీరావ్ స్మారకాన్ని ఏర్పాటు చేయడం ఎంతో సముచితమని అభిప్రాయపడ్డారు. "భారత స్వాతంత్ర్య సంగ్రామం ఛత్రపతి శివాజీ మహారాజ్‌తో ప్రారంభమైంది. ఆ పోరాట స్ఫూర్తిని పీష్వాలు మరో వందేళ్లపాటు ముందుకు నడిపించారు. వారు లేకపోయి ఉంటే మన దేశ ప్రాథమిక స్వరూపం నిలిచిపోయేదే కాదు" అని అమిత్ షా పేర్కొన్నారు. కేవలం 40 ఏళ్ల వయసులోనే బాజీరావ్ ఎవరూ సాధించలేని విధంగా చరిత్ర సృష్టించారని ఆయన కొనియాడారు. ఈ పర్యటనలో భాగంగా అమిత్ షా నగరంలో జైరాజ్ స్పోర్ట్స్ అండ్ కన్వెన్షన్‌ను కూడా ప్రారంభించారు.

## నైపుణ్యం పోర్టల్...
# ఉద్యోగాల కల్పనకు మిషన్ మోడ్ తో తీసుకెళతాం

* **రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చర్యలు**
* **సెప్టెంబర్ 1 నాటికి 'నైపుణ్యం' పోర్టల్ ప్రారంభించాలని అధికారులకు మంత్రి లోకేష్ ఆదేశం**
* **ప్రతి మూడు నెలలకు ఒకసారి నియోజకవర్గాల్లో జాబ్ మేళాల నిర్వహణ**
* **ఐటీఐల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.600 కోట్ల నిధులు కేటాయింపు**
* **విదేశీ ఉద్యోగాల కోసం దేశాల రాయబార కార్యాలయాలతో సంప్రదింపులు జరపాలని సూచన**
* **పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకుంటే ఆటోమేటిక్‌గా రెజ్యూమ్ తయారయ్యేలా ఏర్పాట్లు**



రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా.. యువత, పరిశ్రమలను అనుసంధానించేలా కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న సింగిల్ ప్లాట్ ఫామ్ 'నైపుణ్యం పోర్టల్'ను సెప్టెంబర్ లో ప్రారంభించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లి నివాసంలోనైపుణ్యాభివృద్ధి శాఖ అధికారులతో నేడు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధి కల్పనకు మిషన్ మోడ్ విధానంలో నైపుణ్యం పోర్టల్ ను ప్రజల్లోకి తీసుకెళతామని వెల్లడించారు. ఇందులో 90 రోజులపాటు ఈ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని చెప్పారు. ఈ మేరకు సెప్టెంబర్ 1 నాటికి నైపుణ్యం పోర్టల్ ను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలకు అనుగుణంగా నైపుణ్యం పోర్టల్ ను తీర్చిదిద్దుతున్నట్లు ఈ సందర్భంగా అధికారులు వివరించారు. మంత్రి నారా లోకేశ్ స్పందిస్తూ.. నైపుణ్యం పోర్టల్ లో ప్రతిఒక్కరూ రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత ఆటోమేటిక్ గా రెజ్యూమ్ సిద్ధమయ్యేలా పోర్టల్ ను తీర్చిదిద్దాలని ఆదేశించారు. అలాగే స్కిల్ అసెస్ మెంట్, అన్ని కంపెనీల్లోని ఖాళీగా ఉన్న ఉద్యోగాల అవకాశాలను యువతకు తెలియజేసి తగిన నైపుణ్యాన్ని పెంపొందించి వారికి ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమగ్ర సమాచార సేకరణకు వివిధ విభాగాలతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రతి మూడు నెలలకోసారి నియోజకవర్గాల్లో జాబ్ మేళాల నిర్వహణకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా ఉపాధి కల్పన కార్యాలయాల పనితీరుపై కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. రాష్ట్రాన్ని క్లస్టర్ల వారీగా విభజించి నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించే అంశంపై అధికారులు మంత్రికి వివరించారు.

* **మంత్రి లోకేశ్ కృషితో ఐటీఐల అభివృద్ధికి రూ.600 కోట్లు కేటాయించిన కేంద్రం**

ఇటీవల ఢిల్లీ పర్యటన అనంతరం ఐటీఐల అభివృద్ధికి హబ్ అండ్ స్పోక్ విధానంలో కేంద్ర ప్రాయోజిత కార్యక్రమం ద్వారా రూ.600 కోట్లు కేటాయించడం జరిగిందని అధికారులు ఈ సందర్భంగా తెలిపారు. ఓమ్ క్యాప్ విభాగంపైనా సమావేశంలో చర్చించారు. విదేశాల్లో ఉద్యోగ, ఉపాధి కల్పనను మరింత సులభతరం చేసేలా ఆయా దేశాల రాయబార కార్యాలయాలతో సంప్రదింపులు జరపాలని ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ సూచించారు.

## కరీంనగర్‌లో 'పది' విద్యార్థులకు
# 20వేల సైకిళ్లు పంపిణీ: బండి సంజయ్

కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో పదో తరగతి విద్యార్థులకు 20వేల సైకిళ్లను పంపిణీ చేయనున్నట్లు కేంద్రమంత్రి బండి సంజయ్ వెల్లడించారు. తన పుట్టిన రోజు(జులై 11న)కు ముందే జులై 8 లేదా 9 తేదీల్లో వీటి పంపిణీని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి విద్యార్థులకు ప్రధాని నరేంద్ర మోదీకానుకగా సైకిళ్లను ఇవ్వనున్నట్లు 'ఎక్స్'లో తెలిపారు. జిల్లాల వారీగా కరీంనగర్‌లో 3,096 మంది విద్యార్థులకు, రాజన్న సిరిసిల్లలో 3,841మంది, జగిత్యాలలో 1,137మంది, సిద్దిపేటలో 783 మంది, హనుకొండలో 491మందికి చొప్పున మొత్తంగా 9,348 మంది విద్యార్థులకు ఈ సైకిళ్లను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అదనంగా కరీంనగర్ కార్పొరేషన్‌లోని 66 డివిజన్లలో 50 చొప్పున సైకిళ్లను పంపిణీ చేయాలని ప్లాన్ చేసినట్లు తెలిపారు. దీంతో పాటు అన్ని



మండలాల్లో 100 చొప్పున; హుజూరాబాద్, జమ్మికుంట, హుస్నాబాద్, సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి, కొత్తపల్లి మున్సిపాల్టీల్లో వార్డుకు 50 చొప్పున సైకిళ్లను పంపిణీ చేయనున్నట్లు సంజయ్ పేర్కొన్నారు. తన పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని గ్రామ పంచాయతీల్లోనూ 10 నుంచి 25 సైకిళ్లను పంపిణీ చేస్తామన్నారు. ఒక్కో సైకిల్ ధర రూ.4వేలు కాగా.. ఇప్పటికే 5వేల సైకిళ్లు వచ్చాయని, వీటిపై ప్రధాని మోదీ ఫొటో ఉంటుందని పేర్కొన్నారు.



# 9న సార్వత్రిక సమ్మెకు సహకరించండి

*** ప్రభుత్వరంగ సంస్థలను తాకట్టుపెట్టే కేంద్రం చర్యలను ప్రతిఘటిద్దాం**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ప్రభుత్వ రంగ సంస్థలు, జాతీయ సహజ వనరుల రక్షణ, కార్మిక చట్టాల పరిరక్షణ కోసం జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. సమ్మెను జయప్రదం చేయాలనీ కోరుతూ కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, ఫెడరేషన్ల, అసోసియేషన్ల పిలుపుమేరకు శుక్రవారం కొత్తగూడెం పట్టణంలోని ప్రధాన సెంటర్ల మీదుగా బైక్ ర్యాలీ నిర్వహించారు. లక్ష్మీదేవిపల్లి మండలంలోని పాలకేంద్రం నుంచి ప్రారంభమైన ర్యాలీ ఎంజి రోడ్డు, పెద్దబజార్, బస్టాండ్, పోస్టాఫీసు మీదుగా బైపాస్ రోడ్డువరకు చేరింది. ర్యాలీ ప్రారంభ, ముగింపు సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య, సిఐటియు జిల్లా నాయకులూ ఏజే రమేష్, ఐఎన్టియుసి జిల్లా నాయకులు జలీల్, ఐఎఫ్టియు, టియుఎల్ఈ జిల్లా నాయకులు సంజీవ్ ఏడుకొండలు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తోందని, జాతీయ సంపదను, ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా స్వదేశీ,విదేశీ కార్పొరేట్లకు అమ్మేస్తుందని ఆరోపించారు. డీజిల్, పెట్రోల్, వంట గ్యాస్, నిత్యావసరాల ధరలను పెంచి పేద, మధ్యతరగతివర్గాలపై పెనుభారం మోపుతోందని విమర్శించారు. కార్మిక చట్టాలను సవరించి శ్రామికుల శ్రమను యాజమాన్యాలు దోచుకునే విధంగా కేంద్రం కుట్రలు చేస్తుందన్నారు. ఈ పరిస్థితిలో జరుగుతున్న సమ్మెను విజయవంతం చేయడం ద్వారా కేంద్రానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వంగ వెంకట్, ఎస్ వి రమణమూర్తి, గెద్దాడ నగేష్, బందారు మల్లయ్య, భూక్యా శ్రీనివాస్, సిఐటియు నాయకులు భూక్యా రమేష్, బాలకృష్ణ, బాలరాజు, ఐఎన్టియుసి నాయకులు నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాకు 28 కొత్త కోర్టులు మంజూరు

*** బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అమరేందర్ రెడ్డి**




ప్రజాస్ఫూర్తి, కాప్రా : తెలంగాణ ప్రభుత్వం తాజాగా జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాకు 28 కొత్త కోర్టులు మంజూరు చేయడం జరిగింది. ఈ సందర్భంగా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు నేవూరి అమరేందర్ రెడ్డిమీడియాతో మాట్లాడుతూ, ఇది జిల్లా న్యాయ వ్యవస్థ అభివృద్ధిలో మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు. కొత్తగా మంజూరైన కోర్టుల్లో జిల్లా కోర్టు కాంప్లెక్స్ కుషాయిగూడలో రెండు ఫ్యామిలీ కోర్టులు రెండు అదనపు జిల్లా కోర్టులు నాలుగు అదనపు మెజిస్ట్రేట్ కోర్టులు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. దీని ద్వారా ప్రజలకు న్యాయం మరింత త్వరగా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా వారు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి,రాష్ట్ర ప్రభుత్వానికి తమ కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఘనంగా అల్లూరి సీతారామ రాజు జయంతి ఉత్సవాలు



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి ) :విప్లవ జ్యోతి, మన్యం వీరుడు భారత స్వాతంత్ర్య సమర యోధుడు అల్లూరి సీతారామ రాజు 128వ జయంతి ఉత్సవాలను శుక్రవారం ప్రగతినగర్ క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూఅల్లూరి స్ఫూర్తితో, భారతమాతకు సేవ చేస్తూ వారి ఆశయ బాటలో నడవాలని వక్తలు పిలుపునిచ్చారు. ప్రగతినగర్ అల్లూరి సీతారామ రాజు సర్కిల్లోని ఆయన విగ్రహం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, స్వయంసేవకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని అల్లూరికి జోహారులర్పించారు.

## ఎఫ్ ఎస్ సి.పద్మ నికలిసిన కాప్రా సర్కిల్ ఎరుకల సంఘం సభ్యులు

ప్రజాస్ఫూర్తి, కాప్రా :మేడ్చల్ జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఎఫ్ ఎస సి.గా ఇటీవల నియమితులైన పద్మని కాప్రా సర్కిల్ ఎరుకలసంఘం



సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగాట్రైబల్ సమాజ అభివృద్ధికి కృషి చేస్తానని పద్మ హామీ ఇచ్చారు.కాప్రా సర్కిల్ ఎరుకల సంఘం అధ్యక్షులు నాగరాజు, సెక్రెటరీ మల్లేష్, రాంపల్లి నరసింహ, సుభాన్, శంకర్, విజయ్ పాల్గొన్నారు.

## ఘనంగా కొత్తగూడెం డిఎస్పి జన్మదిన వేడుకలు

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం డిఎస్పి రెహమాన్ పుట్టినరోజు వేడుకలు డిఎస్పి కార్యాలయంలో శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కొత్తగూడెం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలోడిఎస్పీరహమాన్ దంపతులు వేదమంత్రాల మధ్య కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం సబ్ డివిజన్ పరిధిలో ఉన్న సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొనిడీఎస్పీ రెహమాన్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.



*** మొక్కలు నాటిన డిఎస్పీరెహమాన్, ప్రకృతి ప్రేమికులు మొక్కల రాజశేఖర్**

కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్ పుట్టినరోజు సందర్భంగా డిఎస్పీ కార్యాలయం ప్రాంగణంలో మొక్కను నాటడం జరిగింది. ప్రతి ఒక్కరు ఈ విధంగా ప్రత్యేక రోజుల్లో మొక్కలు నాటాలని డీఎస్పీ పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోడీ చే ప్రశంసలు అందుకున్న ప్రకృతి ప్రేమికుడు కె ఎన్ రాజశేఖర్, ప్రకృతి హరిత దీక్ష గ్రీన్ మోటార్ వెహికిల్ గార్డెన్ వ్యవస్థాపకులు, సింగరేణియన్, లైన్ షేక్ దస్తగిరి ప్రకృతి హరిత దీక్ష చీఫ్ అడ్వైజర్, ఈ రెండు యోగా కొచ్చర్ల కమలారాని, నైనిక రజువా, మహమ్మద్ అఫాన్ జైది, యంగ్ ఇండియన్ జే బీ బాలు ప్రకృతి హరిత దీక్ష గౌరవ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కొరకు జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ కృషి



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శుక్రవారం లక్ష్మీదేవిపల్లి మండలంలోని గంగమ్మ కాలనీ గుత్తికోయ గ్రామంలో లక్ష్మీదేవి పల్లి పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇట్టి కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ జి.నరేందర్, కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీమాట్లాడుతూ జిల్లాలోని ఆదివాసీల సంక్షేమం,అభివృద్ధి కోసం పోలీస్ శాఖ తరపున ఎల్లప్పుడూ ముందుంటామని అన్నారు. ఆదివాసీ ప్రజలకు కనీస సౌకర్యాలను అందించడమే లక్ష్యంగా పోలీస్ శాఖ పని చేస్తుందని తెలిపారు.ఏజెన్సీ ప్రాంతాల్లోని యువత, పిల్లలు విద్య ద్వారానే ఉన్నత స్థానాలకు చేరుకుంటారనితెలిపారు. గ్రామంలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు ప్రవేశిస్తే వెంటనే పోలీస్ వారికి సమాచారం అందించాలని కోరారు.వర్షాకాలంలో తమ ఇండ్ల చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని,అధికంగా మురుగు నీరు చేరడం వలన దోమలు అధికమైడెంగ్యూ,మలేరియా,టైఫాయిడ్ వంటి విషపూరిత జ్వరాల బారిన పడే అవకాశం ఉందని అధికారులుసూచించారు.అనంతరం ఎస్పీచేతుల మీదుగా అక్కడ నివసించే 27 కుటుంబాల వారికి దుప్పట్లు,దోమ తెరలను పంపిణీ చేశారు.విద్యుత్,మొబైల్ నెట్వర్క్ సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు.అనంతరం మద్దె గుంపుకు చేరుకొని అక్కడ నివసిస్తున్న ఆదీవాసీ ప్రజల ప్రస్తుత స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, లక్ష్మీదేవిపల్లి ఎస్సై రమణా రెడ్డి, ఎస్సై కార్తీక్, లక్ష్మీదేవిపల్లి పోలీసు సిబ్బంది,స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.




## ప్రభుత్వానికి, ప్రజలకు వారధులు విలేకరులు

*** పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి**

మేడిపల్లి, ప్రజాస్ఫూర్తి :ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధి లాంటి వారు పత్రిక విలేకరులని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవిఅన్నారు. మేడిపల్లి మండల ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నికైన సందర్భంగా ప్రెస్ క్లబ్ ఆవరణలో కమిటీ సభ్యులను కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆధ్వర్యంలోశుక్రవారం నాడుసన్మానించడం జరిగింది... ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ ప్రజలకు మంచి వార్తలను అందించే విధంగా విలేకరులు పనిచేయాలని తమ విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని అన్నారు. ప్రజా సమస్యలను ప్రతిబింబించేలా వారి మన్ననలు పొందాలని అన్నారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చిర్ర శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ... మేడిపల్లి మండల పరిధిలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు వచ్చే విధంగా ప్రజా పాలన ప్రభుత్వం కృషి చేయాలని కోరారు.. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ముఖ్య సలహాదారులు వి. సూర్యనారాయణ రెడ్డి,మాజీ అధ్యక్షుడు కల్మూరి ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి వడ్డేమాను సుందర్, కోశాధికారి మరాటి మల్లేష్ ఉపాధ్యక్షులు సైరెడ్డి సాగర్ రెడ్డి,చింత రమేష్, కోఆర్డినేటర్ రావునాగిరెడ్డి, సంయుక్త కార్యదర్శి చిన్న మధు, నీరుడు అంజన్ కుమార్, దాసరి దయాకర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు బుసా గణేష్,భాస్కర చారీ,శేరి కరుణాకర్ రెడ్డి, మత్స్యగిరి భగీరథరెడ్డి, నరేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు

## హైదరాబాద్కు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: హైదరాబాద్ ఎల్బి స్టేడియంలో జరిగిన కాంగ్రెస్ గ్రామ స్థాయి అధ్యక్షుల ఆత్మీయ సమావేశానికి ముస్తాబాద్ మండల కాంగ్రెస్ నాయకులు భారీగా తరలివెళ్లారు. కాంగ్రెస్ ముస్తాబాద్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనంలో నాయకులు తరలారు. తరలివెళ్లిన వారిలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, వివిధ విభాగాల అధ్యక్షులు, కార్యకర్తలు ఉన్నారు.

## కొత్తగూడెం మండల స్థాయి విత్తనాల సేకరణలో రామవరం హై స్కూల్

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:విద్యార్థుల్లో పర్యావరణం పచ్చదనం, చెట్ల ప్రాముఖ్యత పట్ల అవగాహన పెంచే క్రమంలో భద్రాద్రి జిల్లా కలెక్టర్జితేష్ వి. పాటిల్వినూత్నంగా విత్తనాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు కొత్తగూడెం మండలంలో రామవరం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల రామవరం, కూలీలైన్ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల కూలీలైన్ ప్రథమ స్థానంలో నిలిచాయి. ఆపై మండల స్థాయిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల రామవరం ప్రథమ స్థానంలో, కూలీలైన పాఠశాల ద్వితీయ స్థానంలో ఉన్నాయి. కాంప్లెక్స్ స్థాయి విజేతలకు రూ.1000 మండల స్థాయి విజేతలకు రూ.5000 ప్రోత్సాహకంగా కలెక్టర్ప్రకటించారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించే వారికి 50 వేలు ప్రోత్సహంగా కలెక్టర్ ఇవ్వనున్నారు. చెట్ల పెంపకంవాటి ప్రాముఖ్యత గూర్చి ఈ వినూత్న కార్యక్రమాన్ని విద్యార్థుల్లో అవగాహన కలిగించేలా జిల్లా కలెక్టర్ వినూత్నంగా శ్రీకారం చుట్టారు. 80 రకాలు సుమారుగా 70 కేజీ లా విత్తనాలను విద్యార్థులు సేకరించారు. కొత్తగూడెం మండల స్థాయి ఎంపికలో నిర్ణేతలుగా ఆనందఖని ఉన్నత పాఠశాల సీనియర్ సిబ్బంది, కూలీ లైన్ స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం లాలు, కొత్తగూడెం ఎంఈఓ డాక్టర్ ప్రభుదయాల్, సిఆర్పిలు, ఎమ్ఆర్పిలు పాల్గొన్నారు.

## సైబర్ మోసాలపై అవగాహన... 90 మందికి రూ.15.23 లక్షల కోర్ట్ ఆర్డర్లు పంపిణీ



ప్రజాస్ఫూర్తి, కాప్రా : కుషాయిగూడ పోలీస్ స్టేషన్ నందు సైబర్ క్రైమ్ అవగాహన సదస్సు నిర్వహించబడింది. ఈ సదస్సులో స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎల్. భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, సైబర్ మోసాల బారిన పడిన బాధితులు వెంటనే పోలీసులను ఆశ్రయించాలని కోరారు. బాధితులను ధైర్యపెట్టి, తక్షణమే 1930 టోల్ ఫ్రీ నంబర్ లేదా [www.cybercrime.gov.in](http://www.cybercrime.gov.in) వెబ్సైట్ ద్వారా ఫిర్యాదు చేయించటం ద్వారా నిందితుల ఖాతాలను ఫ్రీజ్ చేయించి కోల్పోయిన మొత్తాన్ని రికవరీ చేయడంజరుగుతుందని తెలిపారు. అనంతరం విచారణతో నిందితుల వివరాలు సేకరించి, కోర్టులో రిఫండ్ కోసం రిక్విజిషన్లు దాఖలు చేసినట్టు వివరించారు. ఈ ప్రక్రియలో భాగంగా కుషాయిగూడ కోర్టు గౌరవ మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు 90 మంది బాధితులకు కోర్ట్ ఆర్డర్లు అందాయని, వాటి విలువ మొత్తం రూ. 15,23,484/ అని తెలిపారు. ఈ కోర్ట్ ఆర్డర్లను సదస్సు సందర్భంగా బాధితులకు పంపిణీ చేశారు. సదస్సులో పాల్గొన్న బాధితులు తమ అనుభవాలను పంచుకుంటూ, తాము ఎదుర్కొన్న సైబర్ మోసాల వివరాలు వెల్లడించారు.ఈ సందర్భంగా డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ జి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ప్రజలు సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద లింకులు క్లిక్ చేయకూడదని, అకౌంట్, ఓటీపీ వివరాలు ఎవరికీ ఇవ్వకూడదని తెలిపారు. ప్రజలు పోలీసులతో సమన్వయం సాధించి, అవగాహన పెంచుకోవాలని సూచించారు.

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన రామచంద్రరావుకు ఘన సత్కారం

ప్రజాస్ఫూర్తి, కాప్రా : బీజేపీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన ఎన్. రామ చంద్రరావును పార్టీ మల్కాజ్గిరి పార్లమెంట్ నియోజకవర్గ నేతలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రామచంద్రరావును శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు మాట్లాడుతూ, “తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకు రావాలంటే ప్రతి కార్యకర్త పార్టీ సైనికుడిగా పనిచేయాలి. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత మనందరిదీ అని కార్యకర్తలను ఉద్దేశించి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మల్కాజ్గిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్,సీనియర్ నాయకుడు మర్రి మోహన్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, సీనియర్ నాయకుడు కృష్ణ రెడ్డి, రమేష్, రమణ, చిత్తారితో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.



# ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు

ప్రజాస్ఫూర్తి, కా.ప్రా :అల్లూరి సీతారామరాజు 128వ జయంతి వేడుకల సందర్భంగా మీర్పేట్ హెచ్ బి కాలనీ డివిజన్ పరిధిలోని హౌసింగ్ బోర్డు మెయిన్ రోడ్డులో దివంగత మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, కార్పొరేటర్ జేరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి లు పాల్గొని పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు మహోన్నత వ్యక్తి అని, దేశానికి సాయిధ పోరా టం ద్వారానే స్వాతంత్రం వస్తుందని నమ్మి అల్లూరి చేసిన పోరాటం స్వాతంత్ర ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయమని, నిరుపేదలు, నిరక్ష రాస్యులు, అమాయకులైన అనుచరులతో, అతి తక్కువ యుద్ధ వనరులతో బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఢీకొన్న అల్లూరి సీతారామరాజు 27సంవత్సరాల వయసులోనే 1924 మే 7వ తేదీన స్వాతంత్ర ఫలాల కోసం అంతిమ శ్వాస విడిచాడని గుర్తు చేశారు. రెండు సంవత్సరాల పాటు బ్రిటీషర్లకు కంటి నిండా నిద్రలేకుండా గడగడలాడించిన వ్యక్తి అల్లూరి అని గుర్తు చేశారు. మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు చేసిన పోరాటానికి ప్రతీకగా మా అన్న దివంగత మాజీ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి హయాంలో ఈ యొక్క విగ్రహ ఏర్పాటుకు పూర్తి తోడ్పాటు అందించి, స్థల కేటాయింపు విషయంలో ఆయన చేసిన కృషికి గర్వపడుతూ ఇకముందు కూడా రాజి రెడ్డి బాటలోని నడుస్తూ ప్రతినిత్యం మీకు అందుబాటులో ఉంటూ పూర్తి సహకారం నా తరపున మీకు ఎల్లవేళలా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకల నిర్వాహకుల సహకారంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోటుబుక్కులు మరియు బ్యాగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంజరి ప్రవీణ్ కరిపే, గుమ్మడి జంపాల్ రెడ్డి, ఉల్లేం బాలరాజు, చారి, మల్లేష్ గౌడ్, బాల నరసింహ, హరినాథ్ రెడ్డి, భూపాల్ గౌడ్, గడియారం రామకృష్ణ, అమర్నాథరెడ్డి, నిసార్ అహ్మద్ గోరి, పూస రమేష్, సలీముద్దీన్, దండెం నరేందర్, మధు వర్మ, డీవీఎస్ఎస్ఎన్ రాజు, జయారామరాజు, రామకృష్ణ, వాసురాజు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీశ్రీశ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి ఆలయంలో ఘనంగా శాకాంబరీ దేవి ఉత్సవాలు



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : ఆషాడ మాసం సందర్భంగాఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ ఫేస్ 2 లోని శ్రీశ్రీశ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి దేవాలయంలో శాకాంబరీ దేవి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా దేవాలయంలోని అమ్మవారిని పండ్లు,కూరగాయలతో అలంకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, సమ్మారెడ్డి, భాస్కర్ రెడ్డి, శివరాజ్ గౌడ్, పోశెట్టిగౌడ్, గోపాల్ రెడ్డి, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## జై బాబు జై భీమ్ జై సంవిధాన్ భారీ బహిరంగ సభకు తరలివెళ్ళిన కాంగ్రెస్ నేతలు



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : నగరంలోని ఎల్ బీ స్టేడియంలో జరిగే జై బాబు జై భీమ్ జై సంవిధాన్ భారీ బహిరంగ సభకు ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ కార్గే విచ్చేస్తున్న సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ కొలన్ హనుమంత్ రెడ్డి అధ్యక్షతన నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, ఎన్ఎంసీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి భారీ ఎత్తున బస్సులలో తరలివెళ్ళారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, డివిజన్ అధ్యక్షులు,కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

*** మాజీ మేయర్ అమర్ సింగ్**



ఫీర్జాదిగూడ, (ప్రజాస్ఫూర్తి) : పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని బుద్ధనగర్శ్రీ సాయి బాబా ఆలయంలో వార్షిక బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని మాజీ మేయర్ అమర్ సింగ్ అన్నారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆయన తో పాటు మాజీ కార్పొరేటర్ భీమ్ రెడ్డి,నవీన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ బొందుగుల కృష్ణ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులువంగేటి ప్రభాకర్ రెడ్డి, రంజిత్ రెడ్డి,భాస్కర్,బుద్ధనగర్ కాలనీ అధ్యక్షులు,ఇతర కాలనీ పెద్దలు ఈ నిర్ణయం తీసుకున్నారు.2025 జూలై 20వ తేదీ ఆదివారం ఈ ఉత్సవాలను వైభవంగా జరుపుకోవాలని నిర్ణయించారు.

## తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య

*** జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. శుక్రవారం బిసి సంక్షేమ ఆధ్వర్యంలో ఐ డి ఓ సి కార్యాలయం సమావేశ మందిరంలోదొడ్డి కొమురయ్య వర్ధంతి ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్కొమురయ్య చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం, విముక్తి పోరాటాన్ని చేసిన.ల్ మహనీయుడుకొమురయ్య అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం మాట వినపడగానే మొట్ట మొదట గుర్తుకొచ్చేది దొడ్డి కొమురయ్య పేరేనని ఆయన తెలిపారు.దొరల దురాగతాలను ఎదిరించిన గొప్ప వీరుడు దొడ్డి కొమురయ్య అని చెప్పారు.వరంగల్ జిల్లాలోని సాధారణ గొర్రె కాపరుల కుటుంబంలో జన్మించిన కొమురయ్య తెలంగాణ మహోన్నత ఉద్యమానికి ఆద్యుడయ్యాడని అన్నారు .తెలంగాణ సాయుధ పోరాటంలో ముందుగా ప్రాణాలను త్యాగం చేసిఉద్యమానికి ఊపిరి పోసాడని అన్నారు. ఈ కార్యక్రమంలోఅదనపు కలెక్టర్ వేణుగోపాల్,బీసీ సంక్షేమ అధికారిని ఇందిర, జిల్లా ఉపాధి కల్పనాధికారి శ్రీరామ్, క్రీడల అధికారి పరంధామ రెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి అనంత రామకృష్ణ, కురుమ సంఘ సభ్యులు దూడల బుచ్చయ్య,లింగయ్య, రవికుమార్, చంద్రశేఖర్, దూడల కిరణ్,సుంక ప్రవీణ్,కోటిలింగం,సంపత్ కుమార్, కే రవి, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక వసతులను మెరుగుపరచాలి

*** పి డి ఎస్ యు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యవర్గం**




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం:ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలోశుక్రవారం డీఈవో ఎం.వెంకటేశ్వర చారికి ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరచాలని వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి జె.గణేష్ మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమైనప్పటికీ మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం జిల్లా యంత్రాంగం అశ్రద్ధ వహించిందని తెలిపారు ముఖ్యంగా పాఠశాలలలో తాగునీటి సమస్య మరియు మరుగుదొడ్ల సమస్య తీవ్రంగా ఉందని మరుగుదొడ్లు శుభ్రపరచడానికి కార్మికులు లేక మరుగుదొడ్లు నిరుపయోగంగా మారి విద్యార్థులు ముఖ్యంగా మహిళా విద్యార్థులు అనేక ఇబ్బందులు గురవుతున్నారని వారు తెలిపారు శాశ్వత త్రాగునీటి సౌకర్యం లేక విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారని వారు విచారం వ్యక్తం చేశారు పాఠశాలల్లో విద్యార్థులు ఆడుకోవడానికి ఆట వస్తువులు లేక విద్యార్థులు శారీరకంగా మరియు మానసికంగా ఎదగలేక పోతున్నారని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. తక్షణం జిల్లా అధికార యంత్రాంగం ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు మెరుగుపరచడానికి చర్యలు చేపట్టాలని వారి సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు డి అరుణ్. జె.చంటి. బి.ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## దొడ్డి కొమురయ్య చూపిన స్ఫూర్తిని కొనసాగించాలి

*** సిపిఐ పార్టీ మండల కార్యదర్శి రచ్చ కిషన్**



బోడుప్పల్, (ప్రజాస్ఫూర్తి) : బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇందిరా నగర్ కాలనీ చౌరస్తాలో మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలోరైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్యవర్ధంతి ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు బాపిరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి రచ్చ కిషన్ దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రచ్చ కిషన్,బాపిరాజు లు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటానికి తొలి అమరుడై స్ఫూర్తినిచ్చిన వ్యక్తి దొడ్డి కొమురయ్య అని తెలిపారు. ఆయన స్ఫూర్తిని కొనసాగించాలని,తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం తలచుకోగానే మొదటగా గుర్తు వచ్చేది పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య అని అన్నారు. తెలంగాణలో భూస్వామ్యపాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సమైక్య కార్యదర్శి జె లక్ష్మి, బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కే ప్రమీల, సిపిఐ పార్టీ మండల సహాయ కార్యదర్శి సిహెచ్ మాధవి, జి నాగరాజు ఏఐటీయూసీ మండల కార్యదర్శి దండు రమేష్, బికేయంయు మండల కార్యదర్శి & అధ్యక్షులు కే మహాలక్ష్మి, భూతం ఐలయ్య, మండల కౌన్సిల్ సభ్యులుఇస్తారు,, నర్సమ్మ, భారతి, మణెమ్మ, మేకల లక్ష్మి, సత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకి అన్యాయం జరిగితే సహించేది లేదు

*** బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి**



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : కార్మికులకి అన్యాయం జరిగితే సహించేది లేదని బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి అన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గం ప్రశాంత్ నగర్ ఇండస్ట్రీ ఏరియాలో "స్నేనేత్ ఎంటర్ ప్రైజెస్ కంపెనీ" లో జితేంద్ర కుమార్ అనే కార్మికుడు గత కొన్ని సంవత్సరాల నుంచి కంపెనీ లో పనిచేసేవారు, కొన్ని అనివార్య కారణాలవల్ల స్నేనేత్ ఎంటర్ ప్రైజెస్ లో పనిచేస్తున్న జితేంద్రకుమార్ మానేశారు. జితేంద్ర కుమార్ అనే కార్మికుడికి ఈ సంవత్సరం ఏప్రిల్ నెల వేతనం, రావాల్సి ఉండగా అవి ఇవ్వకపోవడంతో పలుమార్లు కంపెనీ యజమాన్యాన్ని ఎన్నిసార్లు అడిగినా జితేంద్ర కుమార్ పట్ల నిర్లక్ష్యం వహిస్తూ తనను ఏదో రకంగా కంపెనీ యజమాన్యం పట్టించుకోవడం లేదు అని తెలుసుకొని అడిగి అడిగి విసుగు చెందినకార్మికుడు జితేంద్ర కుమార్ కు ఏం చేయాలో అర్థం కాక ఎవరైతే కార్మికులకు న్యాయం చేస్తారని తోటి కార్మిక మిత్రుల ద్వారా తెలుసుకొని, బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి గురించి తెలుసుకొని తన కార్యాలయం వద్దకు వచ్చి తనకు జరిగిన అన్యాయం గురించి వివరించారు. వెంటనే స్పందించిన కార్మిక నాయకుడు రవి హుటాహుటిన "స్నేనేత్ ఎంటర్ ప్రైజెస్ కంపెనీ"వద్దకు బయలుదేరి యజమాన్యంతో పలుమార్లు చర్చించి కార్మికుడికి జితేంద్ర కుమార్ కిరావలసిన ఏప్రిల్ నెల వేత్తనం ఇప్పించడం జరిగింది. కార్మికుడు జితేంద్ర కుమార్ మాట్లాడుతూ నాకు న్యాయం చేసిన కార్మిక నాయకుడు రవి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## జై జవాన్ కాలనీ జిహెచ్ఎంసి షట్టర్లపై ముందస్తు చర్యలు తీసుకోండి

*** తాడూరి గగన్ కుమార్**



ప్రజాస్ఫూర్తి, కా.ప్రా : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) కు చెందిన ఆదాయం, ఆస్తుల రక్షణలో భాగంగా, కాప్రా సర్కిల్ 01 పరిధిలోని జై జవాన్ కాలనీలో ఉన్న పది కమర్షియల్ షట్టర్లపై కోర్టులో కేవియట్ పిటిషన్ దాఖలు చేయాలని తాడూరి గగన్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ సమాచార హక్కు సాధన సమితి మేడ్చల్మల్కాజిగిరి జిల్లా కన్వీనర్గా ఉన్న గగన్ కుమార్, జిహెచ్ఎంసి కమిషనర్ కి లిఖితపూర్వకంగా మనవి చేశారు. ఇప్పటికే 16022024న ప్రజావాణి ద్వారా, 09062025న జిహెచ్ఎంసి నిర్వహించిన ప్రజావాణిలో షట్టర్ల వ్యవహారంపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. జూన్ 30న జిహెచ్ఎంసి హెడ్ ఆఫీస్కు సమర్పించిన ఫిర్యాదుతో పాటు, ఎస్టేట్స్ విభాగం ద్వారా జారీ చేసిన Lr.No: 359621/EO/GHMC/2025 ఆధారంగా, కాప్రా సర్కిల్ 01 అధికారులచే షట్టర్లు ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు.అయితే, కొంతమంది షట్టర్లు నడిపిస్తున్నవారు కోర్టును ఆశ్రయించే అవకాశముండడంతో, జిహెచ్ఎంసి ఆదాయాన్ని (ప్రతి నెల రూ.50వేలు నుంచి రూ.60వేలు), ఆస్తిని కాపాడేందుకు ముందస్తుగా సీపీసీ సెక్షన్ 148A (2002 సవరణ) ప్రకారం కేవియట్ పిటిషన్ దాఖలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ చర్య ద్వారా జిహెచ్ఎంసి ఆదాయాన్ని కాపాడటంతో పాటు, ప్రభుత్వ ఆస్తులను అక్రమంగా ఆక్రమించే ప్రయత్నాలకు అడ్డుకట్ట వేయవచ్చని గగన్ కుమార్ అభిప్రాయపడ్డారు.

## భారతావని కీర్తిని ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన స్వామి వివేకానందుడు

*** స్వామి వివేకానంద యువజన సంఘం అధ్యక్షులు జల్దా లక్ష్మీ నాథ్**



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి ) : భారతావని కీర్తిని ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన స్వామి వివేకానందుడని లో స్వామి వివేకానంద యువజన సంఘం అధ్యక్షులు జల్దా లక్ష్మీ నాథ్ అన్నారు. స్వామి వివేకానంద వర్ధంతిసందర్భంగా శుక్రవారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్ లో ఏర్పాటు చేసిన స్వామి వివేకానందుడి చిత్ర పటానికి ఆయన పాల్గొని పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత కు దార్శ నికుడన్నారు. ఈ కార్యక్రమం లో యువజన సంఘం నాయకులు రంగా సాయి గౌడ్, తిమ్మయ్య, నవీన్,విజయ్, సత్యనారాయణ,దత్తు గౌడ్, సందీప్, సాయి కిరణ్, రామ్ చందర్, రాందాస్, ఆనంద్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుల సమ్మేళన సభకు తరలిన కాంగ్రెస్ నేతలు



హైదరాబాద్, (ప్రజాస్ఫూర్తి) : హైదరాబాద్ లాల్ బహదూర్ స్టేడియంలోశుక్రవారం టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ సారథ్యంలో రాజ్యాంగ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగానిర్వహిస్తున్న గ్రామ,పట్టణ స్థాయి కాంగ్రెస్ అధ్యక్షుల సమ్మేళన భారీ బహిరంగ సభకు ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ముఖ్యతిథిగా విచేస్తున్న సందర్భంగా ఈ భారీ బహిరంగ సభను విజయవంతం చెయ్యడానికిపీర్జాదిగూడ బోడుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జీ తోటకూర వజ్రేష్ యాదవ్,మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి నాయకత్వంలో బస్సులు, కార్ల లోబోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు పోగుల నర్సింహా రెడ్డి,పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు తుంగతుర్తి రవి,బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అమర్ సింగ్,బోడుప్పల్ మున్సిపల్ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్,పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ శివ గౌడ్,మాజీ కార్పొరేటర్లు మాజీ ప్రజా ప్రతినిధులు,సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్,అనుబంధ సంఘాలు అధ్యక్షులు, అభిమానులు పెద్ద సంఖ్యలో బయలుదేరారు...

# కేంద్ర ప్రభుత్వ కార్మిక ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతుంది

* **సీఐటీయూ కన్వీనర్ బి. వెంకట్రామయ్య, సిఐటియు నాయకులు ఎం చంద్రశేఖర్ లు**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మిక ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని సీఐటీయూ కన్వీనర్ బి. వెంకట్రామయ్య, సిఐటియు నాయకులు ఎం చంద్రశేఖర్ లు అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రగతి నగర్ సుందరయ్య భవన్లో తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా నాయకులు ఎం చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. బాచుపల్లి మండల తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక కన్వీనర్ బి వెంకట రామయ్య, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని జులై 9 దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని తీర్మానించారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయటం ద్వారా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. దేశ వ్యాప్త సమ్మెకు ప్రజలు ప్రజాతంత్ర వాదులు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్మిక వర్గం పోరాటాల ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్స్ ను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. పారిశ్రామిక సంబంధాల కోడ్ ద్వారా ఫిక్స్డ్ టర్మ్ ఎంప్లాయిమెంట్ ను చట్టబద్ధం చేసి రెగ్యులర్ ఉద్యోగుల ఉద్యోగ భద్రతకు ముప్పుతెచ్చిందన్నారు. లేబర్ కోడ్స్ ప్రకారం ట్రేడ్ యూనియన్ల ను ఉద్యోగుల కార్మికుల సంఘటిత శక్తిని బలహీనపరిచే విధంగా ఉన్నాయన్నారు. పారిశ్రామిక సంబంధాల కోడ్ అమలు అయితే 300 మంది లోపు పని చేసే పారిశ్రామిక సంస్థల్లో



యాజమాన్యాలు ప్రభుత్వ అనుమతి లేకుండానే యథేచ్ఛగా కార్మికుల్ని తొలగించవచ్చని ఇది అత్యంత ప్రమాదకరమైందన్నారు. ట్రేడ్ యూనియన్ల ఏర్పాటు రిజిస్ట్రేషన్ లను కట్టిన తరం చేస్తుందన్నారు. కార్మికులు సమ్మె చేయటం సాధ్యం కాకుండా ఆంక్షలు విధిస్తుందన్నారు. సామాజిక భద్రత కోడ్ అమలు వల్ల ఉద్యోగులు పొందే ఈపీఎఫ్ కాంట్రిబ్యూషన్ 12 నుండి 10 శాతానికి తగ్గిపోతుందన్నారు. ఒక సంస్థ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఈపీఎఫ్ నుండి మినహాయింపు పొందేందుకు ప్రభుత్వానికే అధికారం ఇచ్చింది అన్నారు. ఈ కోడ్ అమలు అయితే భవిష్యత్తులో ఈపీఎఫ్ సౌకర్యం తొలగించడమే అన్నారు. కనీస వేతనం 26 వేల రూపాయలుగా నిర్ణయించాలని డిమాండ్ ను పట్టించుకోకుండా మోడీ ప్రభుత్వం నేషనల్ ఫ్లోర్ మినిమం వేజ్ ను రోజుకు రూ.178 లుగా నిర్ణయించి కార్మిక ద్రోహానికి పాల్పడిందన్నారు. నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని, కనీస వేతనం 26 వేల రూపాయలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జెవివి పెన్షనర్స్ అసోసియేషన్, భారత ప్రజాతంత్ర మహిళా సంఘం, విద్యార్థి సంఘం, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, నాయకులు సిహెచ్ మల్లయ్య చారి, వెంకటరాజ్యం, శంకర్రావు, శ్రీనివాస్, కృష్ణయ్య, రెడ్డి, ఎం బాల పీరు, రోజా, ఇందిరా, విజయ, మార్క్స భరత్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య

* **జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. శుక్రవారం బిసి సంక్షేమ ఆధ్వర్యంలో ఐ డి ఓ సి కార్యాలయం సమావేశ మందిరంలోదొడ్డి కొమురయ్య వర్ధంతి ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్కొమురయ్య చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం, విముక్తి పోరాటాన్ని చేసిన.ల్ మహనీయుడుకొమురయ్య అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం మాట వినపడగానే మొట్ట మొదట గుర్తుకొచ్చేది దొడ్డి కొమురయ్య పేరేనని ఆయన తెలిపారు. దొరల దురాగతాలను ఎదిరించిన గొప్ప వీరుడు దొడ్డి కొమురయ్య అని చెప్పారు. వరంగల్ జిల్లాలోని సాధారణ గొర్రె కాపరుల కుటుంబంలో జన్మించిన కొమురయ్య తెలంగాణ మహోన్నత ఉద్యమానికి ఆద్యుడయ్యాడని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ముందుగా ప్రాణాలను త్యాగం చేసిఉద్యమానికి ఊపిరి పోసాడని అన్నారు. ఈ కార్యక్రమంలోఅదనపు కలెక్టర్ వేణుగోపాల్, బీసీ సంక్షేమ అధికారిని ఇందిర, జిల్లా ఉపాధి కల్పనాధికారి శ్రీరామ్, క్రీడల అధికారి పరంధామ రెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి అనంత రామకృష్ణ, కురుమ సంఘ సభ్యులు దూడల బుచ్చయ్య, లింగయ్య, రవికుమార్, చంద్రశేఖర్, దూడల కిరణ్, సుంక ప్రవీణ్, కోటిలింగం, సంపత్ కుమార్, కే రవి, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### సమాచార (ఆర్టీఐ )కమిషనర్

## అయోధ్య రెడ్డికి జర్నలిస్టుల అభినందనలు

ప్రజాస్ఫూర్తి, కాప్రా : తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు చట్టం (ఆర్టిఐ) కమిషనర్ గా నియమితులైన యాదాద్రి జిల్లా వాస్తవ్యులు సీనియర్ జర్నలిస్టు బోరెడ్డి అయోధ్య రెడ్డిని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యుజే) హెచ్143 మేడ్చల్ జిల్లా అధ్యక్షులు బొమ్మ అమరేందర్ ఆధ్వర్యంలో యూనియన్ ప్రతినిధులు జర్నలిస్టులు శుభాకాంక్షలు తెలియజేశారు. శుక్రవారం కాప్రా లోని ఆయన స్వగృహంలోమర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్క అందజేసీ, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుల బృందం అయోధ్య రెడ్డితో భేటీ అయ్యారు ఈ సందర్భంగా గతంలో ఉప్పల్ మేడిపల్లి మండలాలకు సంబంధించిన జర్నలిస్టులకు కాచవాని సింగారంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్ల పట్టాలు మంజూరు చేసినప్పటికీ సమస్య నేటికీ పరిష్కారం కాలేదని ఈ విషయంలో జర్నలిస్టులకు న్యాయం జరిగే విధంగా చూడాలంటూ అయోధ్య రెడ్డిని జిల్లా అధ్యక్షులు బొమ్మ అమరేందర్ కోరారు. . ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు బొమ్మ అమరేందర్ మాట్లాడుతూ యాదాద్రి



జిల్లా తుర్కపల్లి మండల గ్రామంలో సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన అయోధ్య రెడ్డి గత మూడు దశాబ్దాలు గా ఉత్తమ జర్నలిస్టుగా రాణించడమే కాకుండా, రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిపిఆర్వో గా ప్రభుత్వానికి మీడియా వారధిగా అత్యుత్తమ సేవలు అందించి ఎంతో ప్రశంసలు పొంది తెలంగాణ రాష్ట్ర (ఆర్టీఐ ) సమాచార చట్టం కమిషనర్ గా నియమితులు కావడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలోటియుడబ్ల్యూజె_ఐజేయు మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు గడ్డమీది బాల్ రాజుగౌడ్, మల్కాజ్గిరి ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులువిల్సన్, గడ్డమీది గిరి గౌడ్, కాప్రా ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి దొమ్మాటి కిరణ్ కుమార్, యూనియన్ ప్రతినిధులు నరేష్, శ్రీనివాస్, కృష్ణ, కుమార్, కృష్ణ యాదవ్, మేడిపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గుడిసాల సోమయ్య, ప్రధాన కార్యదర్శి నాగభూషణం చారి, ఆర్ నవీన్, జిఎం కిషోర్, రఘు, షామిర్ పేట్ ప్రెస్ క్లబ్ నాయకులు పాషికంటి హరిబాబు నేత, రాము, ఎండి మజీద్ తదితరులు కలిసిన వారిలో ఉన్నారు.

## విద్యార్థులు కష్టపడి బాగా చదువుకొని బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలి



* **మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్మిక్కిలినేని మను చౌదరి**

మేడ్చల్ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి): విద్యార్థులు కష్టపడి బాగా చదువుకొని బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలనిమేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్మిక్కిలినేని మను చౌదరి అన్నారు. శుక్రవారం మేడ్చెల్ మండలంలోని కిష్టాపూర్ లో ఉన్న తెలంగాణ రాష్ట్ర సాంఘికసంక్షేమ రెసిడెన్షియల్స్కూల్ /జూనియర్ కాలేజీ (బాలికలు) ని మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ తనిఖీ చేసారు. ఈ సందర్భంగా స్కూల్లోవసతులు ఏలా ఉన్నాయని, భోజనం ఎలా ఉంటుందని కలెక్టరు విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెను ప్రకారం విద్యార్థులకు భోజనం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకొని, మెను చార్టును పరిశీలించారు. ఈరోజు మెనులో ఏమి వండారని అడిగి, వంటలను పరిశీలించారు. స్కూలు కాలేజీ కలిపి మొత్తం ఎంత మంది విద్యార్థులున్నారని ఇంటర్ లో ఏఏ గ్రూపులు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. స్టోర్ లోని వంట సామాగ్రి నాణ్యతను పరిశీలించిఎక్స్పైరీ డేట్ నమోదుకు రిజిష్టరు నిర్వహించాలని కలెక్టరు సూచించారు. రెండవ అంతస్తులో నిర్మాణంలో ఉన్న హాలును కలెక్టర్ పరిశీలించారు. అనంతరంకలెక్టరు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని, విద్యతోనే భవిష్యత్తు బాగుంటుందన్నారు. కృషి, పట్టుదల, క్రమశిక్షణతో బాగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నత చదువులు ఏమి చదవాలి అనే లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఆదిశగా ముందుకు వెళ్లాలన్నారు. విద్యార్థులు కోరిన మేరకురెసిడెన్షియల్ స్కూల్ లో డ్రైనేజీ, సైన్స్ ల్యాబ్, అదనపు టాయిలెట్లు తప్పకుండా ఇస్తామన్నారు. భోజనశాలలో టేబుల్లు, కుర్చీలు విద్యార్థులకు సరిపడా ఏర్పాటు చేయాలని కలెక్టరు ప్రిన్సిపల్ కు సూచించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపల్ లలిత, జోనల్ ఆఫీసర్ రజిత స్కూలులో ఉన్న మేజర్, మైనర్ రిపేర్లకునిధులు కావాలని కలెక్టరు దృష్టికి తీసుకురాగా, కలెక్టరు పరిశీలించి కొత్త డ్రైనేజీ పైప్ లైన్, టాయిలెట్లరిపేర్లు, దోమల నివారణకు మెష్, ఫ్లోరింగ్ వంటి పనులకు అయ్యే ఖర్చుల అంచానాల ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అధికారులు, తదితరులుపాల్గొన్నారు.

## తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య ఆశయాలు సాధిస్తాం

* **సిపిఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య ఆశయాలు సాధిస్తామని సిపిఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. సిపిఎం కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో దొడ్డి కొమరయ్య 79వ వర్ధంతిని షాపూర్ నగర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకానీ లక్ష్మణ్ మాట్లాడుతూ. వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రలో జూలై 4 అతి ముఖ్యమైన రోజు వీర తెలంగాణ సాయుధ పోరాటానికి అంకురార్పణ జరిగిన రోజన్నారు. భూమి, బుక్తి విముక్తి, కోసం పోరాడి అమరుడైన తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య అని అన్నారు. వీర తెలంగాణ సాయుధ పోరాటాన్ని రగిలించిన అగ్గి రవ్వ దొడ్డి కొమరయ్య అమరుడైన రోజు అమరత్వానికి 79 ఏళ్లు నిండుతున్న తెలంగాణ సాయిధ పోరాట స్ఫూర్తి నేటికీ రగులుతానే ఉందన్నారు. తెలంగాణ పల్లెల నుండి దొరలను నిజాం రజాకార్లను తరిమిన చరిత్ర కమ్యూనిస్టులదనీ సాయుధ పోరాటంలో నిజాం రజాకర్



సైన్యాలకు పటేల్ సైన్యాలకు ఎదురొడ్డి పోరాడి 4,000 మంది నాయకులు కార్యకర్తలు ప్రజలు ప్రాణ త్యాగాలు చేసి దున్నేవాడికే భూమి, ప్రజలను వెట్టిచాకిరి నుండి విముక్తి చేయడం జరిగిందన్నారు. త్యాగాల చరిత్రను ఇప్పుడున్న బిజెపి నాయకులు తెలంగాణ పోరాటం ముస్లిం రాజుకు హిందూ ప్రజలకు మధ్య గొడవగా చిత్రీకరిస్తున్నారన్నారు. తెలంగాణ ప్రజల పోరాట వరసత్వాన్ని అపహస్యం చేస్తున్నారని కేంద్రంలోని బిజెపి నరేంద్ర మోడీ 11 సంవత్సరాల పాలనలో పేదలకు కార్మికులకు ఒరిగిందేమీ లేదన్నారు. ప్రజలకు మేలు చేయకపోగా పోరాడి ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న చట్టాలను అమలు చేయకుండా కార్పొరేట్ సంస్థలకు ప్రజలను కార్మికులను గంపగుత్తాగా బానిసలుగా చేసే కుట్ర చేస్తున్నారన్నారు. ప్రభుత్వ రంగాన్ని మొత్తం నిర్వీర్యం చేసివిద్యా వైద్యం ఉద్యోగం ప్రజలకు అందుబాటులో లేకుండా చేస్తున్నారని ఈ విధానాలకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాట వారసులుగా విద్యా వైద్యం ఉద్యోగం కనీస వేతనాలపై పోరాడాలని అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ నాయకులు పసుల అంజయ్య, రావుల స్వాతి, ఈ దేవదానం, కే శీను నర్సింలు, దుర్గ నాయక్ సురేష్, లింగం, తదితరులు పాల్గొన్నారు

### విజయవాడ హైవేపై

## ప్రమాదం.. ఒకేసారి ఢీకొన్న మూడు కార్లు

* **యాదాద్రి జిల్లా చౌటుప్పల్ వద్ద రోడ్డు ప్రమాదం**
* **హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఘటన**
* **ఒకదానికొకటి ఢీకొన్న మూడు కార్లు**
* **ముందు కారు సడన్‌గా బ్రేక్ వేయడమే కారణం**
* **ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు, అందరూ సురక్షితం**

యాదాద్రి భువనగిరి జిల్లాలో పెను ప్రమాదం తృటిలో తప్పింది. నిత్యం రద్దీగా ఉండే హైదరాబాద్‌విజయవాడ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండలం రెడ్డిబావి వద్ద మూడు కార్లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నప్పటికీ, ప్రయాణికులు సురక్షితంగా బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. జాతీయ రహదారిపై వేగంగా వెళుతున్న ఒక కారు డ్రైవర్ ఒక్కసారిగా బ్రేకులు వేశారు. దీంతో, ఆ కారు వెనుక వస్తున్న మరో కారు ఢీకొట్టింది. దాంతో రెండో కారును వెనుకగా వస్తున్న మరో కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కార్ల ముందు భాగాలు, బంపర్లు దెబ్బతిన్నాయి. అయితే, అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

## 50 ఏళ్లలో ఒక్క బీసీనైనా సీఎం చేశారా?: కాంగ్రెస్‌పై బండి సంజయ్ ఫైర్

* **రాష్ట్ర కేబినెట్ లో బీసీలకు తగినన్ని మంత్రి పదవులు ఇవ్వలేదని విమర్శ**
* **ఆరు గ్యారెంటీల అమలులో విఫలమయ్యారని మండిపాటు**
* **ప్రజలు బీజేపీవైపు మొగ్గు చూపుతున్నారని వ్యాఖ్య**



కాంగ్రెస్ పార్టీ నిర్వహించ తలపెట్టిన సభపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ సభ పేరును 'సామాజిక అన్యాయ సమర భేరి'గా మార్చుకోవాలని ఎద్దేవా చేశారు. ఏ అర్హతతో కాంగ్రెస్ పార్టీ సమర భేరి నిర్వహిస్తోందని ఆయన నిలదీశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ, "50 ఏళ్లకు పైగా దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ ఒక్క బీసీ నేతకైనా ప్రధాని పదవి ఇచ్చిందా? కనీసం ఒక్క బీసీనైనా ముఖ్యమంత్రిని చేసిందా?" అని సూటిగా ప్రశ్నించారు. రాష్ట్రంలో జనాభాలో సగభాగం ఉన్న బీసీలకు కేబినెట్‌లో ఎన్ని మంత్రి పదవులు కేటాయించారని ఆయన నిలదీశారు. పొన్నం ప్రభాకర్‌కు మంత్రి పదవి ఇవ్వడంతో బీసీల గొంతు వినిపిస్తోందని, అలాంటప్పుడు మిగతా బీసీలకు ఎందుకు అవకాశమివ్వలేదని అన్నారు. ఇచ్చిన 6 గ్యారంటీలను కూడా అమలు చేయడంలో విఫలమయ్యారని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో యూరియా కొరత అంశంపై కూడా బండి సంజయ్ స్పందించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారని, ఇది చూసి ఓర్వలేకే కాంగ్రెస్ ప్రభుత్వం యూరియా కొరత పేరుతో డ్రామాలు ఆడుతోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకే ఈ తరహా రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును అధికారులు తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. రాష్ట్రం అడిగిన దానికంటే అదనంగా యూరియా సరఫరా చేసేందుకు కేంద్రం సానుకూలంగా ఉందని, ఈ వాస్తవాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ముందు ఉంచాలని ఆయన కోరారు.




# సిగాచి పేలుడు ఘటన.. 39కి చేరిన మృతుల సంఖ్య

* పటాన్‌చెరు ఫ్యాక్టరీ పేలుళ్లలో 39కి చేరిన మృతుల సంఖ్య
* ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహారాష్ట్ర కార్మికుడు మృతి
* ఇంకా లభ్యం కాని తొమ్మిది మంది కార్మికుల ఆచూకీ
* నేడు ప్రమాద స్థలాన్ని సందర్శించనున్న ఉన్నతస్థాయి కమిటీ
* ఏడు రోజుల్లో ప్రభుత్వానికి ప్రాథమిక విచారణ నివేదిక

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో మృతుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఈ దుర్ఘటనలో మరణించిన వారి సంఖ్య శుక్రవారం నాటికి 39కి చేరింది. పటాన్‌చెరులోని ధ్రువ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భీమ్ రావు అనే కార్మికుడు ఈ రోజు మృతి చెందడంతో మృతుల సంఖ్య పెరిగింది. మృతుడు మహారాష్ట్రకు చెందిన వ్యక్తిగా అధికారులు గుర్తించారు. ఈ ఘటనపై తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీ దర్యాప్తును ముమ్మరం చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలోని ఈ కమిటీ శుక్రవారం ప్రమాద స్థలాన్ని సందర్శించనుంది. ప్రమాదానికి గల కారణాలను అన్వేషించి, ఏడు రోజుల్లోగా ప్రాథమిక నివేదికను సమర్పించనుంది. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు 31 మృతదేహాలను గుర్తించామని, మరో తొమ్మిది మంది కార్మికుల ఆచూకీ ఇంకా తెలియాల్సి ఉందని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి. ప్రవీణ్య తెలిపారు. సహాయక బృందాలు శిథిలాల నుంచి 20 అస్థిపంజర భాగాలను వెలికితీసి, డీఎన్ఏ గుర్తింపు కోసం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్లు వెల్లడించారు. ఇప్పటికే 95 శాతం డీఎన్ఏ నమూనాల సేకరణ పూర్తయిందని ఎస్పీ పరితోశ్ పంకజ్ చెప్పారు. ఇదిలా ఉండగా, గాయపడిన 33 మందిలో 12 మంది కోలుకుని డిశ్చార్జ్ అయ్యారని, వారికి తక్షణ సాయంగా రూ. 1 లక్ష చొప్పున అందించామని సిగాచి పరిశ్రమ యాజమాన్యం ప్రకటించింది. క్షతగాత్రులకు పూర్తి వైద్య సహాయం అందిస్తామని హామీ ఇచ్చింది. జూన్ 30న టాబ్లెట్లు, క్యాప్సూల్స్ తయారీలో వాడే పౌడర్ తయారుచేసే ఈ ఫ్యాక్టరీలో భారీ పేలుడు సంభవించిన సంగతి తెలిసిందే.

## యశోద ఆసుపత్రిలో కేసీఆర్..
# ఆరోగ్యంపై కేటీఆర్ కీలక ప్రకటన

* అస్వస్థతతో యశోద ఆసుపత్రిలో చేరిన మాజీ సీఎం కేసీఆర్
* ఆరోగ్యం నిలకడగానే ఉందని వెల్లడించిన వైద్యులు
* అధిక షుగర్, తక్కువ సోడియం స్థాయిలు ఉన్నట్టు నిర్ధారణ
* కొన్ని రోజుల పాటు ఆసుపత్రిలోనే వైద్యుల పర్యవేక్షణ
* ఆందోళన చెందవద్దని 'ఎక్స్' వేదికగా తెలిపిన కేటీఆర్



తెలంగాణ మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్వల్ప అస్వస్థతతో హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చేరిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని యశోద ఆసుపత్రి వర్గాలు, ఆయన కుమారుడు కేటీఆర్ వేర్వేరుగా స్పష్టం చేశారు. గత రెండు రోజులుగా నీరసంగా ఉండటంతో కేసీఆర్‌ను గురువారం సాయంత్రం సోమాజిగూడలోని యశోద ఆసుపత్రికి తరలించారు. ఆయన వ్యక్తిగత వైద్యుడు డాక్టర్ ఎంవీ రావు సూచన మేరకు ఆసుపత్రిలో చేర్పించి వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రాథమిక పరీక్షల్లో కేసీఆర్ రక్తంలో చక్కెర (షుగర్) స్థాయిలు అధికంగా, సోడియం స్థాయిలు తక్కువగా ఉన్నట్లు తేలిందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఈ మేరకు గురువారం రాత్రి హెల్త్ బులెటిన్‌ను విడుదల చేశాయి. చక్కెర, సోడియం స్థాయిలు సాధారణ స్థితికి వచ్చే వరకు కేసీఆర్ వైద్యుల పర్యవేక్షణలో ఆసుపత్రిలోనే చికిత్స పొందుతారని డాక్టర్ ఎంవీ రావు బులెటిన్‌లో పేర్కొన్నారు. ఈ విషయంపై కేసీఆర్ తనయుడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందించారు. సాధారణ వైద్య పరీక్షల కోసమే తన తండ్రి ఆసుపత్రిలో చేరారని తెలిపారు. ఆయన ఆరోగ్య సూచికలన్నీ (వైటల్స్) సాధారణంగానే ఉన్నాయని, ఎవరూ ఆందోళన చెందవద్దని విజ్ఞప్తి చేశారు. కేసీఆర్ ఆరోగ్యం గురించి ఆరా తీస్తున్న శ్రేయోభిలాషులు, పార్టీ కార్యకర్తలకు కేటీఆర్ కృతజ్ఞతలు తెలియజేశారు.

# కేసీఆర్ త్వరగా కోలుకోవాలి: అసదుద్దీన్ ఒవైసీ

* 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేసిన అసదుద్దీన్ ఒవైసీ
* కేసీఆర్ గారూ.. త్వరగా కోలుకోవాలి అంటూ ట్వీట్
* ఆసుపత్రిలో కేసీఆర్‌ను పరామర్శించిన కవిత



బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ త్వరగా కోలుకోవాలని మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ లోక్‌సభ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. రెండు రోజుల క్రితం స్వల్ప అస్వస్థత కారణంగా కేసీఆర్ సోమాజిగూడ యశోద ఆసుపత్రిలో చేరారు. ఆయన త్వరగా కోలుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తదితరులు ఆకాంక్షించారు. వైద్యులకు ఫోన్ చేసి ఆరోగ్యంపై ఆరా తీశారు.

**పరామర్శించిన కవిత**

కొంతకాలంగా తండ్రితో దూరంగా ఉంటున్నారనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కేసీఆర్‌ను పరామర్శించారు. కేసీఆర్ ఆరోగ్యంపై ఎలాంటి ఆందోళన అవసరం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అంతకుముందు చెప్పారు.




# మహబూబ్‌నగర్‌లో పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్‌లో గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. నగరంలోని బోయపల్లి గేట్ వద్ద 6వ నంబర్ బోగి పట్టాలు తప్పినట్లు లోకో పైలట్ గుర్తించి రైలును నిలిపివేశారు. సుమారు 20 మీటర్ల మేర స్లీపర్ (సిమెంటు పట్టాలు)పై రైలు వెళ్లింది. గూడ్స్ రైలు రామగుండం నుంచి తమిళనాడుకు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో మహబూబ్‌నగర్ కర్నూలు మార్గంలో 3 గంటలుగా రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. చెంగల్‌పట్టు, హంద్రీ, మైసూర్, సెవెన్‌హిల్స్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిచిపోయాయి. పట్టాలు తప్పిన గూడ్స్ రైలు వద్ద మరమ్మతులు చేపట్టేందుకు కాచిగూడ నుంచి యాక్షన్ రిలీఫ్ ట్రైన్‌ను అధికారులు రప్పించారు.

## ఆసుపత్రి నుంచే కేసీఆర్
# రాజకీయ సమీక్ష.. ప్రజా సమస్యలపై నేతలతో చర్చ

* వైద్య పరీక్షల కోసం యశోద ఆసుపత్రిలో చేరిన కేసీఆర్
* పరామర్శకు వచ్చిన నేతలతో ప్రజా సమస్యలపై చర్చ
* రాష్ట్రంలో రైతుల ఇబ్బందులు, సాగునీటిపై ప్రధానంగా ఆరా
* యూరియా కొరత, బనకచర్ల అంశంపై నేతల నుంచి ఫీడ్‌బ్యాక్
* సమావేశంలో కేటీఆర్, హరీశ్‌రావు సహా పలువురు ముఖ్య నేతలు



బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరోగ్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రిలో చేరినప్పటికీ రాష్ట్ర రాజకీయాలు, ప్రజా సమస్యలపై దృష్టిసారించారు. సోమాజిగూడలోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన శుక్రవారం తనను పరామర్శించేందుకు వచ్చిన పార్టీ ముఖ్య నేతలతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిస్థితులపై ఆయన ఆసుపత్రిలోనే సుదీర్ఘంగా చర్చించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆయనను పరామర్శించేందుకు కేటీఆర్, హరీశ్ రావుతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నాయకులు ఆసుపత్రికి తరలివచ్చారు. ఈ సందర్భంగా వారితో ముచ్చటించిన కేసీఆర్, రాష్ట్రంలోని రైతుల ఇబ్బందులు, వ్యవసాయ రంగంలోని సంక్షోభం, సాగునీటి సమస్యలు వంటి అంశాలపై ఆరా తీశారు. ముఖ్యంగా, రైతులకు యూరియా కొరత తీవ్రంగా వేధిస్తోందని, బనకచర్ల విషయంలో ప్రభుత్వ వైఖరి సరిగ్గా లేదని పలువురు నేతలు కేసీఆర్ దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలుస్తోంది. నేతలు వెల్లడించిన క్షేత్రస్థాయి వివరాలను కేసీఆర్ ఓపికగా విన్నారు. ప్రస్తుత పరిణామాలపై వారి నుంచి అభిప్రాయాలు, ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు.

## ఎప్పటికైనా సీఎం అవుతా...
# బీఆర్ఎస్ లో అవమానాలు ఎదుర్కొంటున్నా: కవిత

* కొత్త పార్టీ పెట్టేది లేదు, బీఆర్ఎస్ తనదేనని కవిత స్పష్టీకరణ
* కేసీఆర్ చుట్టూ ఉన్న దెయ్యాలను ఏరివేస్తేనే పార్టీకి మనుగడ అని వ్యాఖ్య
* కేటీఆర్‌తో రాజకీయంగా కొంత గ్యాప్ వచ్చిందన్న కవిత



రాజకీయాల్లో తన అంతిమ లక్ష్యం ముఖ్యమంత్రి కావడమేనని, పదేళ్లు పట్టినా, ఇరవై ఏళ్లు పట్టినా ఆ ఆశయాన్ని నెరవేర్చుకుంటానని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె పలు కీలక విషయాలు వెల్లడించారు. తాను కొత్త పార్టీ పెట్టబోనని, బీఆర్ఎస్ తన పార్టీ అని స్పష్టం చేస్తూనే, పార్టీ అంతర్గత వ్యవహారాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేయాలనే ఆసక్తిని కూడా ఆమె కనబరిచారు. పార్టీలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై కవిత తీవ్రంగా స్పందించారు. తన తండ్రి, పార్టీ అధినేత కేసీఆర్ చుట్టూ కొందరు దెయ్యాలు చేరాయని, వారిని పార్టీ నుంచి ఏరివేస్తేనే బీఆర్ఎస్‌కు మనుగడ ఉంటుందని ఆమె వ్యాఖ్యానించారు. కొందరి వల్లే పార్టీ ప్రతిపక్షంలో కూర్చోవాల్సి వచ్చిందని ఆరోపించారు. నిజామాబాద్ ఎంపీగా తన ఓటమికి సొంత పార్టీ ఎమ్మెల్యేల సహకార లోపమే కారణమని కవిత ఆరోపించారు. కష్టకాలంలో, ముఖ్యంగా ఈడీ కేసు సమయంలో పార్టీ నుంచి తనకు తగినంత మద్దతు లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు, సోదరుడు కేటీఆర్‌కు మధ్య వ్యక్తిగతంగా ఎలాంటి విభేదాలు లేవని, కానీ రాజకీయంగా కొంత గ్యాప్ వచ్చిందని కవిత అంగీకరించారు. తాను కేసీఆర్‌కు రాసిన లేఖ లీక్ కావడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని వివరించారు. తన ఫోన్ ట్యాపింగ్ జరిగి ఉండొచ్చన్న ఆరోపణలపై మాట్లాడుతూ, కేసీఆర్ అలాంటివి చేయించరని, కింది స్థాయి అధికారులే చేసి ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని, రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ తప్పక అధికారంలోకి వస్తుందని కవిత ధీమా వ్యక్తం చేశారు. తన సామాజిక సంస్థ 'జాగృతి'ని మళ్లీ అన్ని నియోజకవర్గాల్లో బలోపేతం చేస్తానని, దాని కార్యక్రమాలను ఉధృతం చేస్తానని ఆమె తెలిపారు.

## బాసర ఆర్జీయూకేటీలో ప్రవేశాలు..
# ఎంపికైన విద్యార్థుల తొలి జాబితా వచ్చేసింది!

తెలంగాణలోని బాసర, మహబూబ్‌నగర్ ఆర్జీయూకేటీల్లో పీయూసీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఎంపికైన విద్యార్థుల తొలి జాబితా విడుదలైంది. ఈ జాబితాను బాసర ఆర్జీయూకేటీ ఇన్‌ఛార్జి ఉపకులపతి గోవర్దన్ శుక్రవారం విడుదల చేశారు. ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు దాదాపు 20వేల దరఖాస్తులు రాగా.. తొలి విడతలో 1690 మంది (స్పెషల్ కేటగిరీ సీట్లు మినహాయించి) విద్యార్థులను ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులకు జులై 7, 8, 9 తేదీల్లో యూనివర్సిటీ క్యాంపస్‌లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఆర్జీయూకేటీల్లో ప్రవేశాలకు ఎంపికయ్యారో, లేదో తెలుసుకొనేందుకు విద్యార్థులు తమ అప్లికేషన్ ఐడీ, పుట్టిన తేదీ ఎంటర్ చేసి తెలుసుకోవచ్చు.



**ముఖ్యాంశాలివే..**

* ఎంపికైన వారి జాబితాలో అత్యధిక శాతం (72శాతం) బాలికలు ఉండగా.. బాలురు 28 శాతంగా ఉన్నారు. మొత్తంగా ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులే 88 శాతం మేర సీట్లు సాధించారు.
* నిజామాబాద్ జిల్లాకు చెందిన విద్యార్థులు అత్యధికంగా 297 మంది ఆర్జీయూకేటీల్లో ప్రవేశాలకు ఎంపిక కాగా.. జయశంకర్ జిల్లా నుంచి ఒక్కరు మాత్రమే ఎంపికయ్యారు.
* కౌన్సెలింగ్ ఇలా.. జులై 7న ఒకటో నంబర్ నుంచి 564 వరకు; 8వ తేదీన 565 నుంచి 1128 వరకు; 9న 1129 నుంచి 1690 నంబర్ వరకు కౌన్సెలింగ్ ప్రక్రియ చేపడతారు.
* ఎంపికైన విద్యార్థులు తప్పనిసరిగా అవసరమైన ఒరిజినల్ సర్టిఫికెట్లతో నిర్దేశించిన తేదీల్లో ఇచ్చిన సమయానికే హాజరు కావాలి. కౌన్సెలింగ్‌కు హాజరు కాకపోతే ప్రవేశం పొందే అవకాశం కోల్పోతారు.
* మొదటి దశ కౌన్సెలింగ్ తర్వాత మిగిలి ఉన్న సీట్ల కోసం వెయిటింగ్ లిస్ట్‌ను విడుదల చేస్తారు.
* ఈ రెండు ప్రాంగణాల్లో (బాసర, మహబూబ్‌నగర్) ప్రవేశాలకు మొత్తంగా 19,967 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 19,877 చెల్లినవని అధికారులు వెల్లడించారు. దరఖాస్తుదారుల్లో 19,701 మంది స్థానికులు, 176మంది స్థానికేతరులు ఉన్నారు.
* ప్రభుత్వ పాఠశాలల నుంచి 8241 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. ప్రైవేటు స్కూల్స్ నుంచి 3,985, ప్రభుత్వ రెసిడెన్సియల్ స్కూల్స్ నుంచి 7075, గ్లోబల్ కేటగిరీలో పూర్తి కాని సీట్ల కోసం ఆసక్తి కలిగిన వారి నుంచి 1670 దరఖాస్తులు వచ్చాయి.
* ఏవైనా సందేహాలు ఉంటే 7382595661, 8008595661, 9052595661, ఇమెయిల్ admissions@rgukt.ac.in ద్వారా అధికారులను సంప్రదించవచ్చు.

# హిమాచల్‌లో జల ప్రళయం.. 37 మంది బలి, రూ.400 కోట్ల ఆస్తి నష్టం!

* హిమాచల్ ప్రదేశ్‌ను ముంచెత్తిన భారీ వర్షా లు, వరదలు
* ఒక్క మండి జిల్లాలోనే 40 మంది గల్లంతు
* సహాయక చర్యలు ముమ్మరం
* తరగతి గదుల్లోకి వరద నీరు, భయంతో విద్యార్థులు

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు, వరదలు హిమాచల్ ప్రదేశ్‌ను ముంచెత్తుతున్నాయి. ఈ ప్రకృతి బీభత్సంలో ఇప్పటివరకు 37 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. రాష్ట్రవ్యాప్తంగా రూ.400 కోట్లకు పైగా ఆస్తి నష్టం వాటిల్లినట్టు హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ ప్రాథమికంగా అంచనా వేసింది. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విపత్తులో మండి జిల్లా అత్యంత తీవ్రంగా ప్రభావితమైంది. ముఖ్యంగా తునాగ్ సబ్ డివిజన్‌లో రోడ్లు కొట్టుకుపోయి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. విద్యుత్, తాగునీటి సరఫరా వ్యవస్థలు దెబ్బతిన్నాయి. ఒక్క మండి జిల్లాలోనే సుమారు 40 మంది గల్లంతైనట్లు సమాచారం. అక్కడి ఒక గ్రామం పూర్తిగా



నాశనమైందని అధికారులు తెలిపారు. బాధితుల కోసం సహాయక శిబిరాలను ఏర్పాటు చేసి, భారత వైమానిక దళం హెలికాప్టర్ల ద్వారా ఆహార ప్యాకెట్లను జారవిడుస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 250కి పైగా రోడ్లు మూసుకుపోగా, 500కు పైగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, సుమారు 700 తాగునీటి పథకాలు దెబ్బతిన్నాయి. మరోవైపు, సిమ్లాలోనూ వర్షాల కారణంగా తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. "భారీగా వర్షం కురుస్తోంది. మా తరగతి గదుల్లోకి నీళ్లు వస్తున్నాయి. బట్టలు, పుస్తకాలు తడిసిపోతు న్నాయి. ఇళ్ల దగ్గరే ఉండమని మా టీచర్లు చెబుతున్నారు. పాఠశాల చుట్టూ ఉన్న చెట్లు ఎప్పుడు కూలిపోతాయోనని భయంగా ఉంది" అని సిమ్లాకు చెందిన తనుజా ఠాకూర్ అనే విద్యార్థిని తన ఆవేదనను వ్యక్తం చేసింది. రాష్ట్ర, కేంద్ర బలగాలు (ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్), పోలీసులు, హోంగార్డులు సమన్వయంతో సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. 7వ తేదీ వరకు రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండి) హెచ్చరించడంతో అధికారులు అప్రమత్తంగా ఉన్నారు.

# పాకిస్థాన్‌ను ప్రయోగశాలగా వాడుకుంటున్న చైనా: భారత సైన్యం

* పాక్ వద్ద ఉన్న 81 శాతం ఆయుధాలు చైనావేనని ఆర్మీ వెల్లడి
* ఆపరేషన్ సిందూర్ సమయంలో చైనా ఆయుధాలు విఫలమయ్యాయని వెల్లడి
* పాక్-చైనా బంధంపై భారత సైన్యం కీలక వ్యాఖ్యలు.. బహిర్గతమైన రహస్యాలు
* పాకిస్థాన్‌కు చైనా పూర్తిస్థాయి అండ.. భారత వ్యూహాలు లీక్!



పాకిస్థాన్‌ను చైనా తమ ఆయుధాలను పరీక్షించేందుకు ఒక ప్రయోగశాలగా మార్చుకుందని, అయితే కీలక సమయాల్లో ఆ ఆయుధాలు విఫలమవుతున్నాయని భారత సైన్యం సంచలన విషయాలు వెల్లడించింది. పాక్‌కు చెందిన 81 శాతం సైనిక సంపత్తి డ్రాగన్ దేశం సరఫరా చేసిందేనని స్పష్టం చేసింది. ఆర్మీ డిప్యూటీ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ ఆర్ సింగ్ ఇటీవల జరిగిన పరిణామాలపై మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. "మనకు వాస్తవంగా ముగ్గురు శత్రువులు. అందులో పాకిస్థాన్ మొదటిది. దానికి చైనా నుంచి అన్ని విధాలా సహాయం అందుతోంది. పాక్ వద్ద ఉన్న 81 శాతం సైనిక హార్డ్‌వేర్ చైనా నుంచి వచ్చిందే. తమ సైనిక పరిజ్ఞానాన్ని పరీక్షించుకునేందుకు పాక్‌ను చైనా ఒక ల్యాబ్‌లా వాడుకుంటోంది" అని ఆయన అన్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్‌పాక్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పుడు, డీజీఎంఓ స్థాయి చర్చల సమయంలో భారత సైనిక వ్యూహాలకు సంబంధించిన సమాచారాన్ని బీజింగ్ ఎప్పటికప్పుడు ఇస్లామాబాద్‌కు చేరవేసిందని సింగ్ తెలిపారు. పాకిస్థాన్‌కు చైనాతో పాటు టర్కీ నుంచి కూడా మద్దతు లభిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఇటీవల 'ఆపరేషన్ సిందూర్' సమయంలో భారత క్షిపణులను అడ్డుకోవడంలో పాక్ వద్ద ఉన్న చైనా తయారీ హెచ్‌క్యూ9, ఎల్‌వై80 రక్షణ వ్యవస్థలు పూర్తిగా విఫలమైన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. స్టాక్‌హోం ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ గణాంకాల ప్రకారం, 20202024 మధ్య చైనా ఆయుధ ఎగుమతుల్లో 63 శాతం ఒక్క పాకిస్థాన్‌కే చేరాయి. ఈ పరిణామాల నేపథ్యంలో చైనాపాక్ సైనిక బంధంపై భారత సైన్యం నిశితంగా దృష్టి సారించింది.

# హిమాచల్ ప్రదేశ్ లో 'క్లౌడ్ బరస్ట్'.. 69కి పెరిగిన మృతుల సంఖ్య

* హిమాచల్ ప్రదేశ్‌ను ముంచెత్తిన కుండపోత వర్షా లు
* జూన్ 20 నుంచి ఇప్పటివరకు 69 మంది మృతి
* మండీ జిల్లాలో అత్యధికంగా నష్టం, కూలిన ఇళ్లు



దేవభూమిగా పేరొందిన హిమాచల్ ప్రదేశ్‌ను భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు అతలాకుతలం చేస్తున్నాయి. గత రెండు వారాలుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోత వానలకు రాష్ట్రం చిగురుటాకులా వణికిపోతోంది. ఈ ప్రకృతి విపత్తు కారణంగా జూన్ 20 నుంచి జూలై 3 మధ్యకాలంలో సుమారు 69 మంది ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్రవ్యాప్తంగా రూ. 400 కోట్లకు పైగా ఆస్తి నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. వరదల తీవ్రతకు మండీ జిల్లా అత్యధికంగా ప్రభావితమైంది. ఇక్కడ ఆకస్మిక వరదలకు అనేక ఇళ్లు పేకమేడల్లా కూలిపోగా, వందలాది వాహనాలు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాయి. "క్లౌడ్ బరస్ట్ (కుండపోత) తర్వాత సర్వం కోల్పోయాం" అని ఓ స్థానికుడు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆర్మీ, స్థానిక పోలీసులు, విపత్తు ప్రతిస్పందన దళాలు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి. రాష్ట్ర విపత్తుల నిర్వహణ అథారిటీ ప్రత్యేక కార్యదర్శి డీసీ రాణా మాట్లాడుతూ, "ప్రస్తుతం మా ప్రధాన దృష్టి సహాయక చర్యలు, పునరుద్ధరణ పనులపైనే ఉంది. నష్టం అంచనాకు మరింత సమయం పడుతుంది" అని తెలిపారు. మండీ జిల్లాలో కూలిపోయిన మౌలిక సదుపాయాల పునరుద్ధరణకు సీనియర్ ఇంజనీర్లు, అధికారులను పంపినట్లు ఆయన వివరించారు. ఈ విపత్తుల వెనుక వాతావరణ మార్పుల ప్రభావం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. "గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పుల పర్యవసానమే ఈ ఘటనలు. దీని ప్రభావం హిమాచల్‌పైనా పడింది" అని రాణా అన్నారు.

# ముఖ్యమంత్రి పదవిపై డీకే శివకుమార్ మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు



* నా ప్రార్థనలకు సమాధానం లభించి తీరుతుందన్న డీకే
* త్వరలో డీకే ముఖ్యమంత్రి అంటూ ఎమ్మెల్యే వ్యాఖ్యల నేపథ్యంలో కలకలం
* ఐదేళ్ల పాటు తానే ముఖ్యమంత్రిగా ఉంటానన్న సిద్ధరామయ్య
* ప్రస్తుతానికి అధిష్ఠానం ఆదేశాలను పాటిస్తానని శివకుమార్ స్పష్టీకరణ

కర్ణాటక రాజకీయాల్లో ముఖ్యమంత్రి పదవిపై నెలకొన్న చర్చకు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తన తాజా వ్యాఖ్యలతో మరోసారి ఆజ్యం పోశారు. ముఖ్యమంత్రి కావాలన్న తన బలమైన కోరిక ఏదో ఒక రోజు నెరవేరుతుందన్న నమ్మకాన్ని ఆయన పరోక్షంగా వ్యక్తం చేశారు. ఆయన రాజకీయ ఆశయాలపై మీడియా ప్రశ్నించగా తెలివిగా స్పందించారు. "ప్రయత్నాలు ఫలించకపోయినా నేను బలంగా కోరుకున్న దాని కోసం చేసిన ప్రార్థనలకు సమాధానం దొరకకుండా పోదు" అని డీకే శివకుమార్ వ్యాఖ్యానించారు. అయితే ప్రస్తుతం రాజకీయాలు చర్చించే సమయం కాదని, రాష్ట్ర శ్రేయస్సే ముఖ్యమని అన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తమకు నాయకుడని, అధిష్ఠానం సూచనల మేరకే పనిచేస్తామని స్పష్టం చేశారు. ఇటీవల కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ మాట్లాడుతూ మరో రెండు మూడు నెలల్లో డీకే శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని చెప్పడం రాజకీయంగా దుమారం రేపింది. ఈ ఊహాగానాలకు తెరదించుతూ ఐదేళ్ల పాటు తానే ముఖ్యమంత్రిగా కొనసాగుతానని సిద్ధరామయ్య స్పష్టం చేశారు. గతంలో కూడా ముఖ్యమంత్రికి మద్దతుగా నిలవడం తప్ప తనకు మరో మార్గం లేదని, అధిష్ఠానం ఏది చెబితే అది చేస్తానని డీకే శివకుమార్ పేర్కొన్నారు.

# రాష్ట్రంలో 13 పార్టీలకు ఈసీ షాక్.. గుర్తింపు రద్దుకు రంగం సిద్ధం!

* తెలంగాణలో 13 రాజకీయ పార్టీలకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటీసులు
* గత ఆరేళ్లుగా ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయకపోవడమే కారణం
* గుర్తింపు ఎందుకు రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలని ఆదేశం
* జిల్లా కలెక్టర్ల ద్వారా పార్టీలకు షోకాజ్ నోటీసులు జారీ
* ఈ నెల 10 లోపు నివేదిక ఇవ్వాలని అధికారులకు సూచన




తెలంగాణలో పలు రాజకీయ పార్టీలపై రాష్ట్ర ఎన్నికల సంఘం (ఈసీ) కీలక చర్యలు చేపట్టింది. గత ఆరేళ్లుగా ఎలాంటి ఎన్నికల్లోనూ పోటీ చేయకుండా, కేవలం రిజిస్టర్డ్ పార్టీలుగా మాత్రమే కొనసాగుతున్న 13 పార్టీలకు శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. పార్టీ గుర్తింపును ఎందుకు రద్దు చేయకూడదో స్పష్టమైన కారణాలతో వివరణ ఇవ్వాలని ఈ నోటీసుల్లో ఆదేశించింది. రాష్ట్రంలో ఎన్నికల సంఘం వద్ద రిజిస్టర్ అయి ఉండి ఆరేళ్లకు పైగా ఏ ఎన్నికల బరిలోనూ నిలవని పార్టీలను జాబితా నుంచి తొలగించాలని ఈసీ నిర్ణయించింది. ఈ ప్రక్రియలో భాగంగానే 13 పార్టీలను గుర్తించి చర్యలు ప్రారంభించింది. సంబంధిత పార్టీలకు నోటీసులు అందించే బాధ్యతను ఆయా జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులకు అప్పగించింది. ఈ విషయంపై దినపత్రికల్లో, సామాజిక మాధ్యమాల్లో ప్రకటనలు ఇవ్వాలని కూడా జిల్లా అధికారులను ఆదేశించింది. ఆయా పార్టీల నుంచి వివరణ స్వీకరించిన తర్వాత, వాటి గుర్తింపును రద్దు చేయాలా వద్దా అనే దానిపై స్పష్టమైన సిఫార్సులతో కూడిన నివేదికను ఈ నెల 10వ తేదీలోగా సమర్పించాలని స్పష్టం చేసింది. జిల్లాల నుంచి అందిన నివేదికల ఆధారంగా తుది నివేదికను కేంద్ర ఎన్నికల సంఘానికి పంపుతామని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు.

* నోటీసులు అందుకున్న పార్టీల వివరాలు

1. తెలంగాణ కార్మిక రైతు రాజ్యం పార్టీ (హన్మకొండ)
2. ఇండియన్ మైనారిటీస్ పొలిటికల్ పార్టీ (హైదరాబాద్)
3. జాగో పార్టీ (హైదరాబాద్)
4. నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ (హైదరాబాద్)
5. తెలంగాణ లోక్ సత్తా పార్టీ (హైదరాబాద్)
6. తెలంగాణ మైనారిటీస్ ఓబీసీ రాజ్యం (హైదరాబాద్)
7. యువ పార్టీ (హైదరాబాద్)
8. బహుజన్ సమాజ్ పార్టీ (అంబేద్కర్‌పూలే) (మేడ్చల్ మల్కాజిగిరి)
9. తెలంగాణ స్టూడెంట్స్ యునైటెడ్ ఫర్ నేషన్ పార్టీ (మేడ్చల్ మల్కాజిగిరి)
10. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమైక్య సమితి పార్టీ (రంగారెడ్డి)
11. జాతీయ మహిళా పార్టీ (రంగారెడ్డి)
12. యువ తెలంగాణ పార్టీ (రంగారెడ్డి)
13. తెలంగాణ ప్రజా సమితి (కిషోర్, రావు, కిషన్) (వరంగల్)

# తమిళనాట సీఎం అభ్యర్థిగా హీరో విజయ్

తమిళనాడు రాజకీయాల్లో ప్రముఖ సినీ నటుడు దళపతి విజయ్ తన జోరు పెంచారు. రాబోయే 2026 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా ఆయన స్థాపించిన 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) పార్టీ కీలక ప్రకటన చేసింది. పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా వ్యవస్థాపక అధ్యక్షుడు అయిన విజయ్‌ను ఎన్నుకుంటున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు పార్టీ కార్యనిర్వాహక మండలి సమావేశమై ఏకగ్రీవంగా తీర్మానించినట్లు వెల్లడించింది.ఇటీవలే రాజకీయాల్లోకి అడుగుపెట్టిన విజయ్, టీవీకే పార్టీని స్థాపించి తొలి మహానాడు ద్వారా తన సిద్ధాంతాలను, ఆశయాలను ప్రజల ముందుంచారు. 2026 ఎన్నికల్లో తమ పార్టీదే గెలుపని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోకుండా ఒంటరిగానే పోటీ చేస్తామని గతంలోనే స్పష్టం చేశారు. ఈ సందర్భంగా విజయ్ గతంలో చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రాజకీయాలు సినిమాల్లా కాదని, ఇది చాలా సీరియస్ వ్యవహారమని ఆయన అన్నారు.

# మోదీ గారూ.. మీకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాం

**: ట్రినిడాడ్ ప్రధాని ప్రశంసలు**



భారత ప్రధాని నరేంద్ర మోదీకి మరో అరుదైన అంతర్జాతీయ గౌరవం దక్కింది. కరేబియన్ దేశమైన ట్రినిడాడ్ అండ్ టొబాగో తమ దేశ అత్యున్నత పౌర పురస్కారం 'ది ఆర్డర్ ఆఫ్ ది రిపబ్లిక్ ఆఫ్ ట్రినిడాడ్ అండ్ టొబాగో'ను ప్రధాని మోదీకి ప్రదానం చేయనున్నట్లు ప్రకటించింది. ఈ సందర్భంగా ఆ దేశ ప్రధాని కమలా ప్రసాద్ బిస్సేసర్.. మోదీపై ప్రశంసల వర్షం కురిపించారు. "మోదీ గారూ.. మీకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాం" అంటూ ఆయన నాయకత్వాన్ని కొనియాడారు. ప్రపంచ నాయకుడిగా మోదీ అందిస్తున్న సేవలు, ప్రవాస భారతీయులతో ఆయనకున్న బలమైన అనుబంధం, ముఖ్యంగా కరోనా మహమ్మారి సమయంలో ఆయన చూపిన మానవతా దృక్పథానికి గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందిస్తున్నట్లు కమలా ప్రసాద్ తెలిపారు. "మోదీ పర్యటన మాకు గర్వకారణం. ప్రపంచం గౌరవించే దార్శనిక నేతకు స్వాగతం పలకడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నాను" అని ఆమె అన్నారు. మోదీ ఒక పరివర్తనా శక్తి అని, ఆయన దార్శనిక విధానాలతో భారత ఆర్థిక వ్యవస్థను ఆధునీకరించి, ప్రపంచపటంలో దేశాన్ని ఒక శక్తివంతమైన స్థానంలో నిలబెట్టారని కమలా ప్రసాద్ ప్రశంసించారు. కరోనా సంక్షోభ సమయంలో వ్యాక్సిన్ మైత్రి కార్యక్రమం ద్వారా తమ దేశంతోసహా చిన్నదేశాలకు కూడా వ్యాక్సిన్లు అందించి ఆదుకున్నారని గుర్తుచేశారు. "ఇది దౌత్యం కాదు, ఇది మానవత్వం, ప్రేమతో కూడిన బంధం" అని ఆమె అభివర్ణించారు. 2002లో మోదీ ఒక సాంస్కృతిక రాయబారిగా తమ దేశానికి వచ్చారని, నేడు 140 కోట్ల మంది ప్రజల అధినేతగా, ప్రపంచం మెచ్చిన నాయకుడిగా తిరిగి రావడం విశేషమని ఆమె పేర్కొన్నారు. ఇటీవలే ప్రధాని మోదీ గయానా, డొమినికా, బార్బడోస్ దేశాల నుంచి కూడా అత్యున్నత పురస్కారాలు అందుకున్న విషయం తెలిసిందే.




# యూట్యూబ్‌ను షేక్ చేస్తున్న 'హరిహర వీరమల్లు'..

## 24 గంటల్లోనే ఆల్ టైమ్ రికార్డు

**యూట్యూబ్‌లో సంచలనం సృష్టిస్తున్న 'హరిహర వీరమల్లు' ట్రైలర్**

**24 గంటల్లోనే తెలుగులో 48 మిలియన్ల వ్యూస్‌తో సరికొత్త రికార్డు**

**అన్ని భాషల్లో కలిపి 61.7 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించిన వైనం**

**ఈ నెల 24న థియేటర్లలోకి సినిమా**

**టాకీస్:** పవర్ స్టార్ పవన్ కల్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న 'హరిహర వీరమల్లు' చిత్రం విడుదలకు ముందే సంచలనాలు సృష్టిస్తోంది. ఈ నెల 24న సినిమా విడుదల కానున్న నేపథ్యంలో గురువారం విడుదల చేసిన ఈ చిత్ర ట్రైలర్, యూట్యూబ్‌లో సరికొత్త రికార్డులను తిరగరాసింది. విడుదలైన కేవలం 24 గంటల్లోనే ఈ ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి అసాధారణ స్పందన లభించింది.

ఒక్క తెలుగు వెర్షన్ ట్రైలరే 48 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించి, టాలీవుడ్‌లో ఆల్ టైమ్ రికార్డు సృష్టించింది. ఇక అన్ని భాషల్లో కలిపి ఈ ట్రైలర్‌కు 24 గంటల్లోనే 61.7 మిలియన్లకు పైగా వ్యూస్ రాబట్టినట్లు చిత్ర నిర్మాణ సంస్థ సోషల్ మీడియా వేదికగా అధికారికంగా ప్రకటించింది. ఇది కేవలం ఒక రికార్డు మాత్రమే కాదని, భవిష్యత్తులో రాబోయే సినిమాలకు ఒక హెచ్చరిక అని కూడా చిత్రబృందం పేర్కొంది.

చారిత్రక కథాంశంతో భారీ స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో పవన్ సరసన నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. బాలీవుడ్ నటుడు బాబీ డియోల్, అనుపమ్ ఖేర్, సత్యరాజ్ వంటి ప్రముఖులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ. దయాకర్ రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, ప్రముఖ నిర్మాత ఎ.ఎం. రత్నం సమర్పిస్తున్నారు.

మొదట ఈ చిత్రానికి క్రిష్ దర్శకత్వం వహించగా, కొన్ని కారణాల వల్ల ఆయన తప్పుకోవడంతో మిగిలిన భాగాన్ని జ్యోతి కృష్ణ పూర్తి చేశారు. సినిమా విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో చిత్ర యూనిట్ ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసింది.



# భారీ స్థాయిలో విడుదలకు వార్-2 సిద్ధం

**టాకీస్:** యంగ్ టైగర్ ఎన్టీఆర్ భారీ మల్టీస్టారర్ వార్ 2. బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్ తో కలిసి నటిస్తున్నాడుర్. ఇప్పటికే రిలీజ్ అయిన పోస్టర్స్, గ్లిమ్స్ సినిమాపై అంచనాలు భారీగా పెంచేశాయి. కియారా అద్వానీ హీరోయిన్ గా నటిస్తోంది. బాలీవుడ్ బడా నిర్మాణ సంస్థ యష్ రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తుండగా అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ భారీ బడ్జెట్ చిత్రం ఏడాది ఆగస్టు 14 న ఈ సినిమా వరల్డ్ వైడ్ రిలీజ్ కానుంది. అయితే ఈ సినిమా రిలీజ్ కు భారీ ఏర్పాట్లు చేస్తుంది యష్ రాజ్ ఫిల్మ్స్. ఇండియన్ సినిమా హిస్టరీలోనే జరగనటువంటి రీతిలో రిలీజ్ కు ఎ÷-లాన్ చేస్తున్నారట. వినిపిస్తున్న సమాచారం ప్రకారం వార్2 ను ఇండియా వైడ్ గా సుమారు 9,000 స్క్రీన్స్ లో రిలీజ్ చేసేలా ఎ÷-లాన్ చేస్తున్నారట. అదే జరిగితే ఇది ఓ హిస్టరీ అనే చెప్పాలి. ఇప్పటి వరకు అత్యధిక స్క్రీన్స్ లో రిలీజ్ అయిన ఇండియాన్ సినిమాల లిస్ట్ లో సూపర్ స్టార్ రజనీకాంత్ నటించిన రోబో 2.క్ష మొత్తం 7,500 స్క్రీన్స్ పేరిట ఉంది. ఇప్పుడు దాన్ని బీట్ చేయబోతుంది వార్ 2. ఇటు తెలుగు స్టేట్స్ లోను వార్ 2 రిలీజ్ కు భారీ ఏర్పాట్లు జారుతున్నాయి. ఈ సినిమా రైట్స్ ను సితార నాగవంశీ రూ. 90 కోట్లకు కొనుగోలు చేసారు. ఇంతటి భారీ అంచనాల మధ్య విడుదలవుతున్న వార్ 2 ఎంతటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.



**ఎస్ఎస్ఎంబీ 29పై ప్రియాంక కామెంట్స్**

# ఇండియన్ మూవీస్‌ను మిస్ అవుతున్నా..

**ఆ సినిమా కోసం వెయిట్ చేస్తున్నా: ప్రియాంక చోప్రా**

**సోషల్ మీడియాలో వైరల్..**

**టాకీస్:** గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా చేసిన కొన్ని వ్యాఖ్యలు ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. ముఖ్యంగా సూపర్‌స్టార్ మహేశ్ బాబు అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. తాను ఈ ఏడాది ఒక భారతీయ చిత్రంలో నటిస్తున్నట్లు ప్రియాంక చెప్పడంతో, మహేశ్ బాబుతో దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్న 'ఎస్ఎస్ఎంబీ-29' గురించేనని ఫ్యాన్స్ భావిస్తున్నారు. ఈ చిత్రంలో ప్రియాంక చోప్రా ఓ కీలకపాత్రను పోషిస్తున్నారు.

వివాహం తర్వాత హాలీవుడ్‌లో స్థిరపడిన ప్రియాంక చోప్రా, ఇటీవల ఓ ఆంగ్ల మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా తాను ఇండియాను, ఇక్కడి సినిమాలను చాలా మిస్ అవుతున్నట్లు తెలిపారు. "ఈ సంవత్సరం నేను ఓ భారతీయ చిత్రంలో నటిస్తున్నాను. ఆ ప్రాజెక్ట్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. భారతీయ ప్రేక్షకులు నాపై చూపించే ప్రేమ ఎంతో విలువైనది" అని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం 'ఎస్ఎస్ఎంబీ-29' షూటింగ్ దశలో ఉంది. అటవీ నేపథ్యంలో సాగే ఈ అడ్వెంచర్ థ్రిల్లర్‌ను రాజమౌళి భారీ స్థాయిలో తీర్చిదిద్దుతున్నారు. ఈ చిత్రంలో మహేశ్ బాబు సరికొత్త లుక్‌తో, మునుపెన్నడూ చూడని పాత్రలో అలరించనున్నారని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ఇక ఇదే ఇంటర్వ్యూలో, తనకు ఊహ తెలిశాక థియేటర్‌లో చూసిన మొదటి సినిమా మణిరత్నం 'బొంబాయి' అని, ఆ అనుభవాన్ని ఎప్పటికీ మర్చిపోలేనని ప్రియాంక గుర్తుచేసుకున్నారు.

**గ్రామీణ నేపథ్యంలో సాగే..**

# ఉప్పు కప్పురంబు

**టాకీస్:** ఒకవైపు సినిమాలు చేస్తునే మరోవైపు ఓటీటీలకు ఒకే చెబుతుంది నటి కీర్తి సురేష్. ఇప్పటికే అక్క అనే వెబ్ సిరీస్ చేస్తున్న ఈ అమ్మడు మరోవైపు ఉప్పు కప్పురంబు అంటూ ఒక ఓటీటీ సినిమా చేసింది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్‌లో ఈ చిత్రం నేరుగా ఈరోజు ప్రేక్షకుల ముందుకు రాగా ఈ చిత్రానికి ఐవీ శశి దర్శకత్వం వహించాడు. నటుడు సుహాస్ కీలక పాత్రలో నటించాడు. సినిమా కథ మొత్తం చిట్టి జయపురం అనే ఊరి చుట్టూ తిరుగుతుంది. తన తండ్రి మరణంతో చిట్టి జయపురం ఊరి పెద్దగా బాధ్యతలు తీసుకుంటుంది అపూర్వ (కీర్తి సురేశ్). అయితే అపూర్వకి ఇది సంతోషం ఇచ్చేలోపే ఊరికి విచిత్రమైన సమస్య వస్తుంది. ఊరిలో శ్మశానం కొరత ఎదురవుతుంది. ఆ ఊరిలో మొదటగా చనిపోయిన నలుగురికి మాత్రమే శ్మశానంలో చోటు ఉంటుంది. దీంతో ఈ విషయాన్ని ఊరి పెద్ద అయిన అపూర్వ



ముందుకు తీసుకువెళతాడు కాటికాపరి చిన్న (సుహస్). ఈ విషయం తెలిసిన అపూర్వ ఊరి కోసం ఏం చేసింది. అపూర్వకి కాటికాపరి చిన్న ఎలా సహాయపడ్డాడు. శ్మశానం సమస్య ల్లో ఎలాంటి చిచ్చు పెట్టిందనేది ఈ సినిమా కథ. యువ దర్శకులు ఈ మధ్య కొత్త కొత్త కథలతో ప్రేక్షకుల ముందుకు వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఇలాంటి మరో కొత్త కథనే ఈ చిత్రం. చనిపోయిన తర్వాత శ్మశానం కొరత అనే సామాజిక సమస్యను వినోదంతో మేళవించి తెరకెక్కించే ప్రయత్నంలో దర్శకుడు ఐవీ శశి కొంతవరకు సఫలమయ్యారు. కీర్తి విషయానికి వస్తే.. ఇప్పటివరకు గ్లామర్, డీ-గ్లామర్ పాత్రలతో ఆకట్టుకున్న ఈ భామ చాలా రోజుల తర్వాత ప్రత్యేకమైన పాత్రలో నటించింది. అపూర్వ అనే గ్రామ పెద్దగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆమెకు శ్మశానం సమస్య ఎదురవ్వడం. ఈ సమస్యను తాత్కాలికంగా పరిష్కరించా మని అనుకునేలోపు నలుగురు చనిపోవడంతో అది మరింత తీవ్రమవ్వడం ఆసక్తికరంగా సాగుతుంది. అలాగే ఈ సినిమాలో దర్శకుడు శ్మశానం చుట్టూ ఉన్న సమస్యలు, వాటి పరిష్కారాలను చూపించారు.

కీర్తి సురేష్ గ్రామ పెద్దగా బాగా నటించినప్పటికీ, ఆమె పాత్రలో కొన్ని తికమక పెట్టే సన్నివేశాలున్నాయి. ఒక సీన్‌లో అమాయకంగా కనిపించిన కీర్తి, మరో సీన్‌లో చాలా తెలివైన అమ్మాయిగా వ్యవహరించడం లాజికల్‌గా అనిపించదు. కొన్ని సీన్లలో ఆమె అతిగా స్పందించినట్లు కూడా అనిపిస్తుంది. అయితే కీర్తి నటన మాత్రం చాలా బాగుంది. సుహాస్ పాత్ర చాలా స్థిరంగా, ఎక్కడా తడబాటు లేకుండా ఉంటుంది. సినిమా మొత్తం ఎక్కువగా సుహాస్, కీర్తిల మధ్యే సాగుతుంది. కథలో అక్కడక్కడా చిన్న లోటుపాట్లు ఉన్నప్పటికీ, ఈ సినిమా ప్రేక్షకులను ఆలోచింపజేస్తుంది.

# నితిన్ తమ్ముడు కథలో బలహీనతలు



**టాకీస్:** సుదీర్ఘ కెరీర్ ఉన్నా సరైన విజయం కోసం ఎదురు చూస్తున్న కథానాయకుల్లో నితిన్ ఒకరు. ఆయన నటించిన తాజా చిత్రమే 'తమ్ముడు'. 'వకీల్ సాబ్' వంటి విజయవంతమైన చిత్రం తర్వాత వేణు శ్రీరామ్ దర్శకత్వం వహిస్తుండటం, దిల్ రాజు నిర్మాత కావడం, లయ కీలక పాత్ర పోషించడంతో ఈ సినిమాపై అంచనాలు ఏర్పడ్డాయి. అయితే ఏ చిత్రానికైనా కథాకథనం ముఖ్యం. చెప్పదల్చుకుంది సూటిగా చెప్పకుంటే ఎంత పెద్ద హీరో సినిమా అయినా జనం లేచిపోతారు. ఇప్పుడు దర్శకుడు కూడా కథనంలో పెద్దగా శ్రద్ధ పెట్టినట్లుగా లేదు. జై (నితిన్) విలువిద్యలో దేశం తరఫున ఆడి ఎన్నో పతకాలు సాధిస్తాడు. మరొక పెద్ద లక్ష్యంపై గురి పెట్టినా, ఏకాగ్రత కుదరదు. మనసుని ఏవో జ్ఞాపకాలు వెంటాడుతూ ఉంటాయి. అక్క స్నేహలత (లయ)తో ముడిపడిన జ్ఞాపకాలే అవి అని కొన్నాళ్ల తర్వాత తెలుస్తుంది. జై చిన్నప్పుడు జరిగిన కొన్ని సంఘటనలతో కుటుంబానికి దూరమవుతుంది స్నేహలత. ఇంకెప్పుడూ పుట్టింటి గడప తొక్కనని శపథం చేసి వెళ్లిపోతుంది. ఆ మాట ప్రకారమే తండ్రి చనిపోయినా, ఇంటి వైపు తిరిగి చూడదు. అక్క విషయంలో చేసిన ఓ చిన్న తప్పు జైని వెంటాడుతూ ఉంటుంది. ఆ తప్పు గురించి చెప్పి, మళ్లీ అక్కకు దగ్గరవ్వాలని తన స్నేహితురాలు చిత్ర (వర్ష బొల్లమ్మ)తో కలిసి బయల్దేరతాడు. తీరా అక్కడకు వెళ్లాక ఆమె తన కుటుంబంతో కలిసి అంబర గొడుగు అటవీ ప్రాంతంలో జరిగే అమ్మవారి జాతరకు వెళ్లినట్టు తెలుస్తుంది. అలాగే ఆమె తన పేరును ఝాన్సీగా మార్చుకున్నట్టు తెలుసుకుంటాడు.

**అనుష్క ఘాటీ మూవీ**

# విడుదలకు సమస్యలు



**టాకీస్:** టాలీవుడ్ స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి ప్రధాన పాత్రలో నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'ఘాటీ' విడుదల మరోసారి వాయిదా పడే సూచనలు మళ్లీ కనిపిస్తున్నాయి. గతంలో 'వేదం' వంటి విజయవంతమైన చిత్రాన్ని అందించిన క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో అనుష్క నటిస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్న విషయం తెలిసిందే. యూవీ క్రియేషన్స్ సమర్పణలో, రాజీవ్ రెడ్డి, సాయిబాబా నిర్మిస్తున్న ఈ చిత్రం నుండి విడుదలైన గ్లింప్స్ ఇప్పటికే ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. అయితే ఈ చిత్రాన్ని మొదట ఏప్రిల్ 18న విడుదల చేయడానికి సన్నాహాలు చేశారు. కానీ షూటింగ్ ఆలస్యం కావడంతో విడుదల వాయిదా పడింది. ఆ తర్వాత, మేకర్స్ అధికారికంగా జులై 11న సినిమాను విడుదల చేస్తామని ప్రకటించారు. అందుకు తగ్గట్టుగానే షూటింగ్ కూడా పూర్తి చేశారు. అయితే, తాజా సమాచారం ప్రకారం, సినిమాకు సంబంధించిన సీజీ (కంప్యూటర్ గ్రాఫిక్స్) పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, విడుదల తేదీ లోపు అవి పూర్తయ్యే అవకాశం లేదని తెలుస్తోంది. దీంతో, 'ఘాటీ' విడుదల మరోసారి వాయిదా పడే అవకాశం ఉందని.. దీనికి సంబంధించి అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడనుందని యూనిట్ వర్గాలు వెల్లడించాయి. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాకు కొత్త విడుదల తేదీగా ఆగస్టు 27ను నిర్మాతలు పరిశీలిస్తున్నట్లు సమాచారం. అనుష్క అభిమానులు 'ఘాటీ' కోసం ఆసక్తిగా ఎదురుచూస్తుండగా, సినిమా విడుదల ఎప్పుడు జరుగుతుందో వేచి చూడాలి.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.